ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024 | 5

నేడు సీఎం చంద్రబాబు పర్యటన 7


ఊరంతా నీళ్లే : కిర్లంపూడి మండలం రాజుపాలెంలో నీట మునిగిన వీధులు

ఉగ్ర గోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద ఉధృతి



రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద
దిగువకు 11,55,027 క్యూసెక్కులు విడుదల

తగ్గినట్టే తగ్గి.. పెరిగిన గోదారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : గోదావరి వరద పోటె త్తింది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి మహోగ్రరూపం దాల్చింది.కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ప్రమాదస్థాయికి చేరుకుంది. గోదావరి తీర ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రెండు రోజుల కిందట వరద తగ్గిందని ఊపిరిపీల్చుకునే లోపే గోదావరికి మరలా వరద పోటెత్తింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, ఉపనదులు పొంగి పొర్లుతున్నాయి. నదిలో వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో వరద తగ్గినట్టే తగ్గి ఒక్కసారిగా ఉధృతంగా పెరిగింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం రాత్రికి వరద నుంచి పూర్తిగా బయటపడిన స్నానఘట్టాలు 24 గంటల్లో మరలా వరద ప్రవాహం ముంచెత్తింది. మంగళవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు గోదావరి రివర్ కన్జర్వేటర్, హెడ్‌వర్క్స్ ఈఈ కె.కాశీ విశ్వేశ్వరరావు ప్రకటించారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు ఇక్కడ నీటిమట్టం 49.80 అడుగులుగా ఉంది.ఇది మరింత పెరిగే అవ కాశం ఉంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 12 గంటలకు నీటిమట్టం 13 అడుగులకు చేరడంతో 11,55,027 క్యూసెక్కుల వరదను 175 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.అది అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంకలను ముం చెత్తుతూ సముద్రంలోకి పోతోంది. గోదావరి పాండ్ లెవల్ 14.25 మీటర్లకు పెరి గింది. కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవా రం నాటికి రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉందని వరద నీరు 12 లక్షల నుంచి 13 లక్షల క్యూసెక్కుల చేరే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. గోదావరి ఎగువ ప్రాంతాలైన భద్రాచలం, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గడ్ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి భారీ వరద వస్తుందని తెలిపారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళ వారం ఆమె క్షేత్రస్థాయి సమన్వయాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావొచ్చన్నారు. ముంపు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తర లించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాజ మహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లలో అత్య వసర పనులకు కార్యాచరణ సిద్ధం చేసి వెం టనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.రెండు డివిజన్లలో 6 పనులకు ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చారు. రాజమహేంద్రవరం, సీతానగరం, నిడద వోలు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో ముంపు ఎక్కు వగా ఉంటుందని,అక్కడి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిం చాలని జేసీ ఎస్.చిన రాముడు ఆదేశించారు. పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

జల వలయం


వరదలో హై..వే : గొల్లప్రోలులో టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఉధృతంగా వెళుతున్న వరద నీరు

- 7 మండలాల్లో 62 గ్రామాలు మునక
- ఎక్కడికక్కడ కాలువలకు గండ్లు
- ఐదు మండలాల ప్రధానదారులు మూత
- నీట మునిగిన 45 వేల ఎకరాలు
- ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి
- రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద
- కోనసీమలో లంకలు మునక
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ముంచిన ఏలేరు.. ఉప్పొంగుతున్న గోదారి


దారేది : పి.గన్నవరం మండలంలో కనకాయలంక కాజ్‌వేపై వరద

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎటుచూసినా వరద.. ఊళ్లన్నీ ఏరులై.. చేలన్నీ చెరువులై.. ఉదయం కనిపించిన రోడ్లు, ఇళ్లు మధ్యాహ్నానికి వరదలో మాయమయ్యేంత జల ప్రళయం.. జిల్లాలో ఏలేరు వరద మంగళవారం భయోత్పాతం సృష్టించింది. అంచనాలకు అందని జలవిలయంతో ముంచెత్తింది. దీంతో జిల్లాలో ఏడు మండలాల్లో 62 గ్రామాలు వరదలో చిక్కుకుని విలవిల్లాడాయి. 45 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నిండా మునిగాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచీ ఏలేరు వరద మరింత పోటెత్తడంతో పిఠాపురం, గొల్ల ప్రోలు, ఏలేశ్వరం, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, కొత్తపల్లి, సామర్లకోట మండలాల్లో వరద ముంపు భారీగా పెరిగింది. అనేక ప్రధాన రహదారులపై నీళ్లు పొంగుతూ ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. పిఠాపురంలోని రాపర్తి నుంచి గొల్లప్రోలు టోల్‌గేట్ మధ్యలో 216 జాతీయ రహదారిపై వరద నీరు చొచ్చుకొచ్చేసింది. దీంతో ఒకవైపు ప్రయాణాలు నిలిపివేశారు. దీనివల్ల భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఏలేరు నుంచి దిగువకు 42 వేల క్యుసెక్కులకుపైగా నీరు విడుదల చేయడంతో వరద కాలువల్లో పొటెత్తి ఎక్కడికక్కడ గండ్లు పడి తీవ్ర నష్టంవాటిల్లింది. ప్రత్తిపాడు,కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం మండలాల ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండ డంతో తాత్కాలికంగా మూసివేశారు. ముంపు గ్రామాలు విద్యుత్ లేక అంధకారంలో ఉన్నాయి.వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలకోసం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగం దిగాయి.

8 మండలాల్లో వరద ఇలా..

- గొల్లప్రోలు మండలంలో ఏలేరు వరద నష్టం తీవ్రంగా ఉంది.ఏలేరు కాలువకు ఆరు చోట్ల గండ్లు పడ డంతో 8,500 ఎకరాల్లో పంటలు,10 గ్రామాలు నీటముని గాయి. గొల్లప్రోలు-తాటిపర్తి,చెందుర్తి-తాటిపర్తి రోడ్లు మూసివేశారు. వరద ఉధృతికి పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్లే దారిలో రాపర్తి నుంచి టోల్‌గేట్ వరకు వరద జాతీయ రహదారిపైకి వచ్చేసింది.ఈ దారిలో రాత్రి 8 గంటల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపియడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. గొల్లప్రోలు,పిఠాపురం శివారు ప్రాంతాల్లో అనేక కాలనీలను వరద ముంచడంతో బాధితులు ఆకలితో అలమటించారు.
- పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు 9 చోట్ల గండ్లు పడడంతో 14 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగా యి. వరదనీరు ప్రధాన రహదారులపైకి వచ్చేయడంతో గొల్లప్రోలు-బి.ప్రత్తిపాడు,పిఠాపురం-రాపర్తి, పిఠాపురం- నరసింగపురం- జములపల్లి,పిఠాపురం-గోకివాడ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 15 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి.
- కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువకు మొత్తం పది చోట్ల గండ్లు పడడంతో 16 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మొత్తం 21 గ్రామాల్లో వరద చేరింది. రాజుపాలెంలో వందలాది కుటుంబాలు నరక యాతన పడుతున్నాయి.రాజుపాలెం-ముక్కోలు, గెద్దనాపల్లి- భూపాలపట్నం,భూపాలపట్నం-ఎస్.తిమ్మాపురం- బూరుగుపూడి, సోమరాయణపేట, పాలెం వరకు రాకపోకలు నిలిపివేశారు.
- ప్రత్తిపాడు మండలంలో ఏలేరు కాలువకు గండి పడడంతో 1,200 ఎకరాలు నీట మునిగింది.వరదలకు పెద్దిపాలెం, వేము లపాలెం,ధర్మవరం, వెల్దుర్తి రహదారులు మునిగాయి. సుబ్బారెడ్డిసాగర్ కాలువలకు గతంలో పడ్డ గండ్లు తాజా వరద లతో మరింత ఎక్కువయ్యాయి.
- ఏలేశ్వరం మండలంలో 2,800 ఎకరాలు నీటమునిగాయి. ఎర్రవరం,తిరుమాలి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.
- పెద్దాపురం మండలంలో ఏలేరుకు ఒక చోట గండిపడి 4,300 ఎకరాలు నీటమునిగాయి.మర్లావ వరదలో చిక్కుకుంది.పెద్దాపురం నుంచి కాండ్రకోట రాకపోకలు నిలిపేశారు.
- సామర్లకోట మండలంలో ఏలేరు వరద కారణంగా పంట పొలాలు నీటమునిగాయి. టిడ్కో గృహాల వద్ద భారీగా వరద నీరు చేరింది. ఉప్పువారి సత్రం నుంచి జల్లూరు వరకూ 8 కి.మీ మేర వరదనీరు చేరింది. సామ ర్లకోట-పిఠాపురం మధ్య ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిపివేశారు.
- కొత్తపల్లి మండలంలో 800 ఎకరాల్లో పంట నీట మునిగింది.

కోనసీమలో భయంభయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద ఉగ్ర రూపం దాల్చడంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. గోదావరి వరద ఉధృతి కారణంగా కోనసీమలోని గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో ప్రవాహ వేగం పెరుగుతోంది. ఇప్పటికే ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 7 గంటలకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో నదీపాయలన్నీ పొంగి పొర్లుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన చాకలిపాలెం కనకాయలంక కాజ్‌వే జలదిగ్బంధానికి గురైంది. సమీపంలోని లంక ప్రాంతాలను వరద ప్రవాహం ముంచెత్తుతోంది. నదీపాయలను ఆనుకుని ఉన్న కాజ్‌వేలు ముంపు బారిన పడడంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. వరద పెరుగుతున్నందున కొన్నిచోట్ల విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతోంది. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నారు. కుండలేశ్వరం సమీపంలో కుంగిన గట్టు వద్ద గడ్డర్లు ఏర్పాటుచేసి వాహనాలు వెళ్లకుండా అధికారులు నిరోధించారు. సముద్రపు మొగల వద్ద అలల ఉధృతి తీవ్రంగా ఉంది. ప్రధానమైన రేవుల్లో పరిస్థితిని బట్టి పంట్లు, పడవలపై రాకపోకలు సాగించాలని, వరద పెరిగితే తక్షణం నిలుపుదల చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులు ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అటు ప్రజలను, ఇటు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కోనసీమ జిల్లాకు కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం 17 పాయింట్లలో జరుగుతున్న ప్రయాణికుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. పడవలపై ప్రయాణం చేయాలనుకునే వారికోసం లైఫ్ జాకెట్లు, గత ఈతగాళ్లను సిద్ధం చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ సమయంలో జి.పెదపూడి వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేయగా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే 44 ప్రాంతాల్లో పునరావాసాల్లో ఏర్పాటు చేయనున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి వెళ్లే కాజ్‌వే వద్ద పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. మరోవైపు గోదావరి నదీ పరివాహక లంక గ్రామాల్లోని విద్యా సంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. రాగల 72 గంటల పాటు అధికార యంత్రాంగం అప్రమత్తతతో పనిచేయాలని, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

శాంతించిన బురదకాలువ

గోకవరం, సెప్టెంబరు10: భారీ వర్షాల కారణంగా గోకవరం మండలంలో వందలాది ఎకరాలు నీటమునిగాయి. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో బురదకాలువ, ఊరకాలువ ఉప్పొంగాయి. దీంతో వందలాది ఎకరాల్లో పొలాలు ముంపుబారిన పడి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయితే మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో బురదకాలువ, ఊరకాలువ శాంతించాయి.దీంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.గాదెలపాలెంలో ఇసుకపల్లివారి చెరువు నుంచి నీరు పారే కాలువకు పడిన గండి నీట మునిగిన పంట పొలాలను మంగళవారం తహశీల్దార్ వైసరస్వతి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, వీఆర్వోలు పరిశీలించారు. పూర్తి స్థాయిలో ముంపు తగ్గితేగాని పంట నష్టాన్ని అంచనా వేయలేమని తహశీల్దార్ పేర్కొన్నారు.


గోకవరం మండలం గాదెలపాలెంలో ఇంకనూ ముంపులోనే పంట పొలాలు

తేరుకున్న శ్రీరంగపట్నం

కోరుకొండ, సెప్టెంబరు 10 : బురద కాలువ ఉప్పొంగి గండ్లు పడడంతో రెండు రోజులు కిందట ముంపుబారిన పడిన శ్రీరంగపట్నం గ్రామం మంగళవారం సాయంత్రానికి తేరుకుంది. యానాదులపేట,ఎస్సీ పేట, బీసీ కాలనీలు ముంపు నుంచి బయటపడ్డాయి.దీంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. వరదనీరు తగ్గినప్పటికీ రోడ్లు బురదమయంగా మారాయి.కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఉండడం వల్ల జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం కొనసాగిస్తున్నట్టు తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. గ్రామంలో 4 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్తులకు అవసరమైన మందులు,ఇతరసహాయక చర్యలు అందజేశారు. సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ, మద్దాల రమణ ఆధ్వర్యంలో వీధులను శుభ్రం చేయిస్తున్నారు.


శ్రీరంగపట్నంలో ఇళ్ల మధ్యన వరదనీరు

ఆకారంలో పులి.. జాతిలో పిల్లి!





పులి బోనులో చిక్కలేదు..ఐదు రోజులైనా టెన్షన్ వీడలేదు.. నగరంలోకి వచ్చేస్తుందేమో వస్తే ఏం చేయాలి.. జాతీయ రహదారిపై వెళుతుంటే దాడి చేస్తుందేమో.. ఒక వేళ వస్తే ఏం చేయాలి.. ఇలా రకరకాల ప్రశ్నలతో సతమతమవుతున్నారు. భయంభయంగా ఉన్నారు.. అటవీ అధికారులు హైవేను ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్టు వద్ద కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా పులి అడవిలోనే ఉందని చెప్పి మా పని అయిపోయిందన్నట్టు ప్రవర్తిస్తున్నారు..చిరుత పులి ప్రవర్తన ఎలా ఉంటుంది.. ఏఏ జంతువులపై దాడి చేస్తుంది.. తదితర వివరాలతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చిరుత పులి ఎక్కడ నుంచి వచ్చింది.. ఎలా వచ్చిం దనేది పెద్ద ప్రశ్నగా మారింది. రాజమహేంద్రవరం శివా రు రాజానగరం, దివాన్‌చెరువు పరిధిలో సుమారు 900 ఎకరాల రిజర్వు ఫారెస్టు ఉంది.ఈ ఫారెస్టులో శుక్ర వారం నుంచి అంటే గత ఐదు రోజులుగా చిరుత సంచరి స్తోంది.ఈ ప్రాంతం లాలాచెరువు హౌసింగ్ బోర్డుకు సమీపంలో ఉంది. ఆకాశవాణి కేంద్రం నుంచి పడమర వైపుగా చిరుత వస్తే రాజమహేంద్రవరంలోకి వచ్చే ప్రమాదం ఉంది.దిశ మార్చుకుంటే అటు లాలా చెరువు, ఇటు శ్రీరాంపురం వైపు వెళతుంది. దీంతో రిజర్వు ఫారెస్టు చుట్టూ ఉన్న జనం ఆందోళన చెందుతున్నారు.

ఇదీ చిరుత జీవన విధానం..

చిరుతపులి 2-5 రోజులకొకసారి వేటాడ తాయి. మూడు నాలుగు రోజులకొకసారి నీళ్లు తాగు తాయి.ఎక్కువగా ఉదయం,సాయంత్రం, రాత్రి వేళల్లో ఆహారానికి అన్వేషిస్తాయి. చీతాలు మని షిని వేటాడిన సందర్భాలు అరుదని నిపుణులు చెబుతున్నారు. నిర్మానుష్యప్రదేశంలో నక్కి ఉంటాయి. ఒక్కరోజులో 20-30 కిలోమీటర్లు సంచరిస్తుంది. ప్రస్తుతం చిరుత వేటాడి ఐదు రోజులు దాటింది కాబట్టి మళ్లీ ఆహారానికి లేదా నీటి కోసం ప్రయత్నించే అవకాశం ఉంది.మేకలు, కోతులు దీనికి ఇష్టాహారంగా చెబుతారు.రిజర్వు ఫారెస్టులో కోతుల సంచారం ఎక్కువ.అంటే ఆహారానికి ఇబ్బందిలేదు.

చిన్న జంతువులే ఆహారం..

చిరుతలు..పులుల మాదిరిగా దూకుడుగా మనిషిపైకి దూకే స్వభావం ఉండదు..అదిలిస్తే ప్రాణ భయంతో దాడి చేస్తాయి.ఎందుకంటే చిరుతలు పిల్లి జాతికి చెందిన వన్య ప్రాణులు. కాబట్టి లక్షణాలు పిల్లి లాగే ఉంటాయి.అయితే వన్య మృగం కాబట్టి ఆహారానికి వేటాడే స్వభావం ఉంటుంది.ఇళ్లల్లో తిరిగే పిల్లి నడవడికకు దగ్గరగా చిరుత ఉంటుంది. చెట్లు సులభంగా ఎక్కుతుంది. పులి అంత క్రూరంగా వేటాడదు. చాలా సులభంగా వేటాడి చెట్టుపైకి తీసుకెళ్లి రోజుల తరబడి తింటుంది. వేటకు వాసననే ఆయుధంగా ఉపయోగిస్తుంది. చిరుతకు పరిమాణం తెలుస్తుంది.దానిని బట్టి వేటాడే పద్ధతిని మార్చుకుంటుంది.పాద ముద్రలు చూసి జంతువులను గుర్తు పడుతుంది. చిరుతలు ఎక్కువగా మేకలు, గొర్రెలు, దూడలు, కోళ్లు,నక్కలు, కోతులు వంటి వాటిని వేటాడుతుంటాయి. అం దువల్ల శివారు ప్రాంతాల్లో, గ్రామాల్లోని మేకలు, గొర్రెల మందలు లేదా వాటిని కట్టేసే చోట జాగ్రత్తగా ఉండాలి.రాత్రి వేళల్లో గమనిస్తూ ఉండాలి.

- ఐదు రోజులైనా చిక్కని చిరుత
- భయంభయంగా జనం
- రక్షణ చర్యలు చేపట్టని అటవీ శాఖ
- మనుషులపై దాడి అరుదు
- చిరు జంతువులే టార్గెట్
- ఐదు రోజులకోసారి వేట
- పిల్లిలాగే చిరుత పులి తీరు
- ఏజెన్సీలో 300 చిరుతలు

వచ్చింది ఒంటరిగానా? జంటగానా?

ప్రస్తుతం రాజమహేంద్రవరం శివారులో కనిపించిన చిరుత ఒంటిరిగా వచ్చిందా? జంటగా వచ్చిందా? అనే అనుమానాలున్నాయి.ఉమ్మడి తూర్పుఏజెన్సీలో 300 వరకూ చిరుతపులులు మారేడుమిల్లి, వై.రామవరం, రంపచోడవరం, గుర్తేడు, పాతకోట, భద్రాచలం ఘాట్ ఏరియా, దేవీపట్నంపైన మంటూరు, అడ్డతీగల, రాజ వొమ్మంగి అటవీ ప్రాంతాల్లో ఉన్నాయని అంచనా. ఇవి ఒక్క ఈతలో గరిష్ఠంగా ఆరు పిల్లలకు జన్మ నిస్తాయి. కొంతకాలంగా తూర్పు మన్యంలో చిరుతల సంచారం పెరిగిందనే అంచనాలున్నాయి.ఆహార అన్వేషణలో భా గంగా ఇవి సంచరిస్తూ జనావాసాల్లోకి వచ్చేస్తుంటా యి. చిరుతలు ఏడాదిలో 9 నెలలు ఒంటరిగానే సంచ రిస్తాయి. జతకట్టే సమయంలో మాత్రమే జంటగా ఉం టాయి.చిరుతలకు సాధారణంగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలలు క్రాసింగ్ సమయం. పైగా ఇవి పులి మాదిరిగా దట్టమైన అడవుల్లో కాకుండా జనావాసాలకు కాస్త దగ్గరగానే పిల్లలకు జన్మనిస్తాయి.ఇక్కడ మగ చిరుత సంచరిస్తుందని నిర్ధారణకు వచ్చారు.దీం తో ఇప్పుడు రాజమహేంద్రవరం శివారుకు ఒంటరి చిరుత వచ్చిందా?జంట వచ్చిందా? అనే విషయం తేలాల్సి ఉంది.



గంటకు 110 కి.మీ వేగం..

ఒలింపిక్ చాంపియన్ ఉసేన్ బోల్ట్ గరిష్ఠంగా గంటకు 44.72 కిలో మీటర్ల వేగంతో పరుగెత్తితే..చిరుతలు గంటకు 110 కిలోమీర్ల వరకూ వేగాన్ని అందుకుంటాయి. భూమిపై ఉన్న జంతువుల్లో పరుగులో చిరుత మొదటి స్థానంలో ఉంది. ఒక్క ఉదుటులో ఏడు మీటర్లు దూకుతుంది. కేవలం మూడు సెక న్లలో గరిష్ఠ వేగాన్ని అందుకుంటాయి. పరుగు సమయంలో చిరుత శరీరం అంతా కదులుతున్నా కళ్లు మా త్రం స్థిరంగా వేటా డే జీవిపై కేంద్రీకృతమై ఉండడం వంటి ప్రత్యేకత.

టీడీపీ నాయకులు స్పందించారు..

గోపాలపురం నుంచి రూ.58.58 లక్షలు సహాయం



గోపాలపురం/నల్లజర్ల, సెప్టెంబరు 10 : వరద బాధితుల సహాయ నిధికి రూ. 58,58,999లు విరాళం అందజేసినట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి డీడీని అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం నాలుగు మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. నల్లజర్ల మండలం నుంచి రూ.20,75,613,ద్వారకాతిరుమల రూ.17.25 లక్షలు, గోపాలపురం రూ.11,38,386, దేవరపల్లి రూ.92 వేలు ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు.నాలుగు మండలాల టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, లంక సత్యనారాయణ,తాతిన సత్యనారాయణ, రొంగళ సత్యనారాయణ పాల్గొన్నారు.

జీవో 85 రద్దుకు పీహెచ్‌సీ వైద్యుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 : పీహెచ్‌సీ వైద్యులకు నష్టం వాటిల్లేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.85 రద్దు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) జిల్లా అధ్యక్షురాలు మౌనిక డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులంతా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపామని అన్నారు. బుధ, గురువారాల్లోనూ నిరసన కొనసాగిస్తామన్నారు. 14న పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలకు మాత్రమే పరిమితం అవుతామని, 15న చలో విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి ర్యాలీగా వెళతామని తెలిపారు. 16వ తేదీ నుంచి జీవో 85 రద్దు అయ్యే వరకూ నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ వైద్యులకు అర్హతతో కూడిన పీజీ సీట్లలో పాత జీవో ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనకు శిక్షణ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతే ఆన్‌లైన్ మోసాలకు మొదటి ఆయుధమని.. సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ సిబ్బందికి రెండు రోజుల పాటు కర్నూలుకు చెందిన తెలుగు సైబర్ ఆర్మీ సీఈవో రామాంజనేయులు బృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మోసపూరిత లోన్ యాప్‌లను ఫోనుల్లో ఇన్‌స్టాల్ చేయరాదన్నారు. సైబర్ నేరానికి గురయ్యామని గుర్తించిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడంతోపాటు cybercrime.gov.in వెబ్‌సైటులో ఫిర్యాదు చేయాలన్నారు.

చిరుతపులి జాడ కనబడలేదు!

- అటవీ ప్రాంతాన్ని ఆనుకుని హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల చెత్తాచెదారం
- పందుల సంచారంతో పులికి ఆహారం
- జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 10: చిరుతపులి జాడ సోమవారం రాత్రి ఏ ట్రాప్ కెమెరాల్లో చిక్కలేదని, దాని పాదముద్రలు కూడా గుర్తించబడలేదని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి తెలిపారు. చిరుతపులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకుగాని, పశువులకుగాని ఎటువంటి హాని జరగలేదని మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో మీడియాకు తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విధంగానే మంగళవారం కూడా చిరుతపులిని పట్టుకొనేందుకు అదనంగా బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతాల్లో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని చెప్పారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న నివాస ప్రాంతమైన హౌసింగ్‌బోర్డు కాలనీలోని గృహాల వద్ద నుంచి చెత్తను వేసి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారన్నారు. దీనివల్ల పందులు విపరీతంగా ఉండడంతో చిరుతపులికి ఆహారం సమృద్ధిగా లభిస్తోందన్నారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న నివాస ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద చెత్తను పక్కనే ఉన్న అడవిలో వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రఘునాథపురంలో దూడను చిరుతపులి చంపినట్టుగా వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన సమాచారంలో వాస్తవం లేదన్నారు. ఈ దూడ కనిన్ కుటుంబం (కుక్కలు, నక్కలు)కు చెందిన జంతువు దాడివల్ల చనిపోయిందన్నారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని కోరారు. నకిలీ సందేశాలకు పంపినవారిపై పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపై భారీగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు

రహదారులన్నీ బంద్

- జాతీయరహదారిపై ఏలేరు వరద బీభత్సం
- రెండువైపులా భారీగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు.. రాకపోకలు నిలిపివేత

పిఠాపురం/గొల్లప్రోలు/కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: జాతీయ రహదారిపై ఏలేరు వరద బీభత్సం సృష్టించింది. కాకినాడ-కత్తిపూడి మధ్య 216వ జాతీయ రహదారిని విస్తరించి పునర్నిర్మించిన తర్వాత ఏలేరు వరద రహదారిపై ఇంత భారీస్థాయిలో రావడం ఇదే ప్రథమం. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ఆరుచోట్ల వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏలేరు కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతోపాటు భారీగా మిగులు జలాలను విడుదల చేయడంతో 216వ జాతీయరహదారి వరద నీటిలో చిక్కుకుంది. గొల్లప్రోలు టోల్‌గేటు సమీపంలో, ఇల్లింద్రాడ రైసుమిల్లు వద్ద, పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి జంక్షన్-చై జంక్షన్ మధ్యలో జాతీయరహదారికి రెండువైపులా ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. ఒకవైపు రెండున్నర నుంచి మూడున్నర అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుండడంతో పిఠాపురం-కత్తిపూడి మార్గంలో తొలుత వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఎక్కడిక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను మోహరించారు. వరద ఉధృతికి ద్విచక్రవాహనదారులు, కార్లు, ఇతర చిన్నవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ఒకవైపు ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పిఠాపురం బైపాస్‌రోడ్డు రాపర్తి జంక్షన్ నుంచి టోల్‌గేటు మీదుగా గొల్లప్రోలు బైపాస్‌జంక్షన్ తాటిపర్తి రోడ్డు వరకూ ఒకవైపే వాహనాలను అనుమతించారు. వరద పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాకినాడ-కత్తిపూడి మధ్యగల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం బైపాస్‌రోడ్డు, గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద ఏలేరు వరద నీరు భారీగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి రెండు వైపుల నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఒక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం బైపాస్, గొల్లప్రోలు టోల్‌ప్లాజా, గొల్లప్రోలు బైపాస్‌రోడ్ల మీదుగా వాహనాలను అనుమతించడం లేదని, ఇక్కడ పోలీసు పహారా ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. అచ్చంపేట జంక్షన్, వాకలపూడి లైట్‌హౌస్ జంక్షన్, కత్తిపూడిల వద్ద నుంచే వాహనాలను దారిమళ్లిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు కూడా తెలియజేశారు. ఈ మళ్లింపును వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.


మళ్లింపు ఇలా...

- అచ్చంపేట జంక్షన్ నుంచి కత్తిపూడి వైపు వెళ్లే భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలను గొల్లప్రోలు టోల్‌ప్లాజా వైపు అనుమతించడం లేదు.
- వాకలపూడి, అచ్చంపేట జంక్షన్ నుంచి పిఠాపురం మీదుగా తుని, వైజాగ్ వైపు వెళ్లే వాహనాలను సామర్లకోట మీదుగా ఎన్‌హెచ్ 16 వైపు మళ్లిస్తున్నారు.
- కత్తిపూడి నుంచి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు కత్తిపూడి, జగ్గంపేట, రాజానగరం, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుకోవాలి.

నేడు సీఎం చంద్రబాబు రాక

పెద్దాపురం, సెప్టెంబరు10: సీఎం చంద్రబాబు బుధవారం ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం రాత్రి ఆర్డీవో జె.సీతారామారావుతో కలిసి పర్యవేక్షించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సామర్లకోట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. రోడ్డు మార్గాన 2.40 గంటలకు కిర్లంపూడి మండలం రాజుపాలెం చేరుకుని నీటమునిగిన గ్రామాలు, పంటలను పరిశీలించి బాధితులతో మాట్లాడతారు. 3.10 గంటలకు సామర్లకోట టీటీడీసీలో ఎగ్జిబిషన్‌ను సందర్శించి అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం 4.35కు విజయవాడకు బయలుదేరి వెళతారు.

గోదావరి ఉగ్రరూపం



కాటన్ బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 11 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి.. వరద పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ధవళేశ్వరం, సెప్టెంబరు 10: భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాలు వల్ల ఇంద్రావతి నుంచి వరదనీరు, వాయుగుండం ప్రభావంతో ఒడిశా పరిసరాల్లో కురిసిన వర్షాలు వల్ల శబరి నది ఉధృతమై గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి పోటెత్తుతోంది. సోమవారం రాత్రి నుంచి పెరుగుతున్న నీటిమట్టం గంటకు ఒక్క పాయింట్ చొప్పున పెరుగుదల నమోదు చేసుకోగా మంగళవారం ఉదయం నుంచి మరింత ఉధృతమై గంటకు రెండు పాయింట్లు చొప్పున పెరిగిన నీటిమట్టం రాత్రి 7 గంటలకు 11.75 అడుగులకు చేరి 10,01,811 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండడంతో రివర్ కన్జర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఆపై పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 13 అడుగులుగా నమోదైంది. 11,55,027 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు. నీటిమట్టం మరింత పెరిగి బుధవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరికస్థాయి 13.75 అడుగులకు పెరగవచ్చని అధికారులు అంచనా. ఎగువన భద్రాచలం వద్ద పెరుగుదల వేగం మందగించడంతోపాటు శబరి ఉధృతి తగ్గడంతో ధవళేశ్వరం వద్ద 15 లక్షల క్యూసెక్కుల వరకు వరద రావచ్చని అంచనా. కాగా భద్రాచలం వద్ద వేగంగా పెరుగుతున్న నీటిమట్టం మంగళవారం ఉదయం 9 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికస్థాయి దాటి ప్రవహించగా సాయంత్రం 5గంటలకు 48.20 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 49.80 అడుగులకు చేరుకుంది. కాగా ఎగువన కాళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 8.60 మీటర్లుగా నమోదుకాగా, పేరూరు వద్ద 17.33 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.50 మీటర్లు, భద్రాచలం వద్ద 48.60 అడుగులు, కూనవరం వద్ద 20.28 మీటర్లు, కుంట వద్ద 15.13మీటర్లు, పోలవరం వద్ద 12.52మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 15.82 మీటర్లుగా నమోదైంది. కాగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ కాటన్ బ్యారేజీ పైనుంచి పరిశీలించారు. నీటిమట్టం కొలిచే సూచీలు ఉన్న ప్రాంతంలో నీటి మట్టాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చెప్పారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో రేవుల వద్దకు ప్రజలను అనుమతించబోమని, ఉత్సవ కమిటీకి చెందిన కొందరిని మాత్రమే అనుమతిస్తామన్నారు. వీరి వెంట ధవళేశ్వరం సీఐ గణేష్, ఇరిగేషన్ ఇంజనీర్లు నాగలక్ష్మి, ఎ.సాయిరాం తదితరులున్నారు.




బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎస్పీ



ఏలేరు వరదలో చిక్కుకున్న ముగ్గురు యువకులు

సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన స్థానికులు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 10: ఏలేరు వరదలో ముగ్గురు యువకులు చిక్కుకున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం రాపర్తి గ్రామానికి చెందిన తొమ్మిది మంది యువకులు గోర్రిఖండి వద్ద వరద నీటిని చూసేందుకు వెళ్లారు. అక్కడ వరద నీటిలో దిగగా ప్రవాహానికి చిక్కుకున్నారు. ఆరుగురు యువకులు గట్టుపై నుంచి జములపల్లికి సురక్షితంగా చేరుకున్నారు. అయితే ఎస్.శివ, దుర్గాప్రసాద్, బి.శివలు మాత్రం వరదనీటిలో చిక్కుకుపోయారు. దీనితో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఈలోగానే స్థానికులు వారిని సురక్షితంగా కాపాడి బయటకు తీసుకువచ్చారు. ఆర్డీవో ఇట్ల కిషోర్ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల విరాళం అందిస్తున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

వరద బాధితులకు 'తిరుమల' రూ.50 లక్షల విరాళం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి చెక్‌ను అందించారు. అలాగే బాధితులకు తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 25 వేల ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు పంపించామని తిరుమలరావు తెలిపారు. ఆయనను చంద్రబాబు అభినందించారు.



వరద బాధితుల కోసం డిప్యూటీ సీఎం పవన్‌కు సురుచి ఫుడ్స్ అధినేత మల్లిబాబు రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు 'సురుచి' రూ.20 లక్షల విరాళం

మండపేట, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) రూ.20 లక్షల చెక్కును ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు మంగళవారం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న తమ ఏడు స్వీట్‌స్టాల్స్ ద్వారా ఆదివారం అమ్మకాల ద్వారా వచ్చిన రూ.16.90 లక్షలు, సంస్థ సిబ్బంది 600 మంది ఒక రోజు వేతనం రూ.2.36 లక్షలతోపాటు తాను కొంత కలిపి మొత్తం రూ.20 లక్షల చెక్కును సీఎం సహాయనిధికి అందించినట్టు మల్లిబాబు పవన్‌కు వివరించారు. తాపేశ్వరం సురుచి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను మల్లిబాబు పవన్‌కు వివరించారు. దీంతో పవన్ ఆయనను అభినందించారు. కేరళ తుపాను బాధితులకు అందించిన సాయం గురించి మల్లిబాబు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మల్లిబాబు సత్కరించి, ఐదు కిలోల లడ్డూను పవన్‌కు బహూకరించారు. ఆయన వెంట సురుచి పీఆర్వో వర్మ ఉన్నారు.

కోరుకొండ ఆలయం ఆదాయంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల గోల్‌మాల్

- రూ.15 లక్షల వరకు ఖజానాకు కన్నంపెట్టినట్టు ఆరోపణలు
- ఈవో సీరియస్

అన్నవరం, సెప్టెంబరు 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఒక విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నవరం దత్తత దేవాలయం అయిన కోరుకొండ లక్ష్మీనరసింహ ఆలయంలో ఏడాది కాలంలో వివిధ పద్దుల కింద సుమారు 15 లక్షలు ఆదాయం రాగా అక్కడ ఆదాయం ఇక్కడ చూపించకుండా ఖర్చులు మాత్రమే అన్నవరం దేవస్థానం నుంచి చూపించారు. అక్కడ ఆదాయం చూపకుండా ఖర్చులు మాత్రమే చూపుతుండడం దీనిపై పంపకాలలో తేడా రావడంతో విషయం బయటపడింది. ఈవో రామచంద్రమోహన్ ఈ అంశంపై సిబ్బందిపై ఫైర్ అయ్యారు. తక్షణమే పూర్తి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. లేకుండా సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్టు చెబుతున్నారు. కోరుకొండ ఆలయ ఆదాయవ్యయాలను లీజుల విభాగ అధికారులు చూస్తుండడం పంపకాలలో తేడా రావడంతో విషయం బయటకి పొక్కింది. కోరుకొండ ఆలయం దత్తత తీసుకుని 10 ఏళ్లు అవుతుండగా ఏడాదిలో ఇంత గోల్‌మాల్ జరగగా గతంలో జరిగిన లావాదేవీలపై విచారణ జరిపితే మరింత పెరుగుతుందని అంటున్నారు.

సత్యదేవుడి విమానగోపురం బంగారు తాపడానికి మరోసారి అంచనాలు

అన్నవరం, సెప్టెంబరు 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమానగోపురానికి బంగారుతాపడం చేయించాలనే ప్రతిపాదనకు దేవదాయ కమిషనర్ ఆదేశాలతో టీటీడీ రూ.99 కోట్లు వ్యయం అవుతుందని అంచనావేయగా, దీన్ని మరోసారి అంచనా వేయించాలని దేవస్థానం అధికారులు కోరారు. గతంలో ఒకసారి దేవదాయశాఖ స్థపతి అంచనా సుమారు 12 కోట్లు వేయగా టీటీడీ జ్యూయలరీ విభాగ అంచనా వ్యయం భారీగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికిగాను 114 కిలోల బంగారం వినియోగించాల్సి ఉంటుందని అంచనా వేశారు. గతంలో 40 కిలోల బంగారం పడుతుందని దేవదాయశాఖ స్థపతి అంచనా వేశారు. కాగా రత్నగిరివాసుడైన సత్యదేవుడిని ప్రధానాలయంలో భక్తులు దర్శించుకునే విధానం పాతవిధానంలో అమలుచేయాలని ఈవో రామచంద్రమోహన్ ఆదేశించారు. గతంలో ప్రధానలయంలోకి ఉత్తరదిక్కుకు ప్రవేశించి మూలవరులను దర్శించుకుని దక్షిణమార్గం ద్వారా వచ్చేవారు. పూర్వపు ఈవో ఆజాద్ ప్రదక్షిణ దర్శనం ప్రవేశపెట్టి రూ.300 టిక్కెట్టు నిర్ణయించారు. రద్దీ రోజుల్లో ఈ విధానం వల్ల భక్తులకు ఇబ్బంది కలిగి దర్శనం ఆలస్యం అవుతుండడంతో ఈవో పాత విధానం అమలుచేయాలని ఆదేశించారు.

కండివాగులో పడి మహిళ మృతి



కోటనందూరు, సెప్టెంబరు 10: కాకినాడ జిల్లా కోటనందూరు మండల కే.కొత్తం గ్రామంలో కందువాడు ఉధృతికి మహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోటిమిల్లి తులుపులమ్మ రజకత్వం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజూలాగే కందువాగులో దుస్తులు ఉతికేందుకు దిగి బళ్ల వద్దకు వెళ్తుండగా వరదప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కొట్టుకుపోయింది. స్థానికులు గుర్తించి మహిళను బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు10: రాజమహేంద్రవరంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల ఫైనల్స్ బుధవారం జరుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెమీ ఫైనల్ మ్యాచ్‌లు, మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. మంగళవారం మెన్స్ సింగిల్స్, ఉమెన్ సింగిల్స్, ఉమెన్ డబుల్స్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి.





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్.. (పక్కన) చోరీ సొత్తు

పగలు రెక్కీ చేసి.. రాత్రికి దోచేస్తారు!

- తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న నలుగురు నిందితుల అరెస్టు
- రూ.94.70 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- తొలుత చిరువ్యాపారులు.. సులువుగా డబ్బుల కోసం దొంగతనాల్లోకి
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: ఆ నలుగురు పగలు రెక్కీ చేశారంటే.. రాత్రికి ఆ ఇల్లు దోచుకుంటారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో రాత్రిపూట యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.94 లక్షల70వేల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో నిఘాను పటిష్టం చేసి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ఈక్రమంలో సోమవారం రాత్రి క్రైం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కాకినాడ రూరల్ మండలం సర్పవరం భవనారాయణస్వామి గుడి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారిని కాకినాడ డెయిరీఫారం సెంటర్ బాలవెంకటేనగర్‌కు చెందిన టేకుమూడి శ్రీకాంత్, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గైగోలుపాడు రాజేంద్రనగర్‌కు చెందిన పాత నేరస్తుడు వల్లి లక్ష్మణ్‌కుమార్, అతడి అన్నయ్య వల్లి రాంకుమార్, ధవళేశ్వరానికి చెందిన పాత నేరస్తుడు మెండి మహేశ్వరదుర్గాప్రసాద్‌గా గుర్తించారు. గతంలో వీరు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్నారు. ఈ క్రమంలో టేకుమూడి శ్రీకాంత్, వల్లి లక్ష్మణ్‌కుమార్ కలిసి కాకినాడ నగరం, ఇంద్రపాలెం, సామర్లకోట, తిమ్మాపురం, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో ఇళ్లలోకి దూకి తలుపులు తాళాలు బద్దలకొట్టి దొంగతనాలను చేసేవారు. దొంగిలించిన సొత్తును లక్ష్మణ్‌కు అన్నయ్య అయిన రాంకుమార్ ద్వారా అతడి స్నేహితుడైన మెండి మహేశ్వరదుర్గాప్రసాద్‌ను సంప్రదించి.. అతడి ద్వారా గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి ఆ సొమ్మును జల్సా చేసేవారని ఎస్పీ వెల్లడించారు. శ్రీకాంత్, లక్ష్మణ్‌కుమార్ మొత్తంగా 21 ఇళ్లల్లో నేరాలకు పాల్పడి రూ.1కోటి44లక్షల 24వేల విలువైన చోరీసొత్తును కొల్లగొట్టి కొంత సొమ్ము జల్సా చేశారని తెలిపారు. నిందితుల నుంచి రూ.84 లక్షల విలువైన 1200 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.9.90 లక్షల విలువైన 11 కిలోల వెండి వస్తువులను, నేరాలకు వినియోగించేందుకు ఉపయోగించిన రూ.80 వేల విలువైన మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నేరస్తులను చాకచక్యంగా పట్టుకోవడంలో విశేష కృషిచేసిన కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీడీఎస్పీ సీహెచ్ శ్రీరామ కోటేశ్వరరావు, సర్పవరం సీఐ పెద్దిరాజు, క్రైం సీఐ వి.కృష్ణ, ఎస్ఐలు రామకృష్ణ, వినయ్‌ప్రతాప్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, హెచ్‌సీలు గొప్పు సత్తిబాబు, గొప్పు చిన్న, పీసీలు మౌళి, నాయుడు, స్వామిలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎన్‌జేవీ భాస్కర్‌రావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు, ఎస్‌బీడీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అటు వరద గోదావరి ఇటు శబరి దూకుడు!

ఏజెన్సీ విలీన మండలాల్లో ముంచెత్తిన వరద.. నిలిచిపోయిన రాకపోకలు



చింతూరు మండలం చట్టి వద్ద ఏపీ - ఛత్తీస్‌గఢ్ 30వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



చింతూరు మండలం ముకునూరు వద్ద సోకిలేరు వాగు దాటించి రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న బాధితులు

చింతూరు, సెప్టెంబరు 10 : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. శబరి, సీలేరు నదులతో పాటు సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 22 గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గంటగంటకు పెరుగుతున్న వరద లోతట్టు వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. పోలవరం బ్యాక్ వాటర్ కారణంగానే తమకు ఏటా వరద సమస్య వస్తోందని బాధితులు వాపోతున్నారు. తమకు పరిహారం ఇచ్చి పునరావాస కేంద్రాలకు తరలించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చింతూరు ఒడ్డు వాసులు మంగళవారం వరద నీటిలో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వారి వద్దకు వెళ్లి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాగా మంగళవారం పెద్దసీతనపల్లి, నర్సింగపేట తదితర ముంపు ప్రభావిత గ్రామాలకు చెందిన రోగులను ముకునూరు వద్ద నాటు పడవ దాటించి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కల్లేరు ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులను జాలర్ల పడవల ద్వారా దాటించి వారి వారి ఇళ్లకు చేర్చారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 44 అడుగుల వద్ద భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగుల వద్ద ప్రవహిస్తుండడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల నడుమ 326, 30వ నెంబరు జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయి చట్టి వద్ద వాహనాలు నిలిచిపోయాయి.





భద్రాచలం-కూనవరం మధ్యలో రహదారిపై చేరిన వరదనీరు.. ఇంట్లో సామగ్రి పట్టుకుని పునరావాస కేంద్రాలకు వెళ్తున్న ప్రజలు

కూనవరంలో జలదిగ్బంధం.. రాకపోకలన్నీ బంద్

కూనవరం, సెప్టెంబరు 10: కూనవరం మండలంలోని వరద ప్రభావంతో అన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-కూనవరంకు పూర్తిగా సంబంధాలు తెగిపోగా, మండలంలోని అన్ని గ్రామాల రహదారులపై వరద వచ్చి చేరింది. ఇప్పటికే పాఠశాలలు మూతపడగా మూడు రోజుల నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈసారి వరదకు శబరి దూకుడు పెంచింది. కూనవరంలో శబరి గోదావరి సంగమం కావడంతో ఆ ప్రదేశం సముద్రంగా కనిపిస్తోంది. అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించేందుకు లాంచీలు సిద్ధం చేశారు. గిన్నెల బజార్, ఉదయభాస్కర్ కాలనీతోపాటు శబరికొత్తగూడెం తదితర గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రచారం నిర్వహించారు. శబరి గోదావరి సంగమం వద్ద ఉన్న శబరి బ్రిడ్జిని తాకి ఉధృతంగా ప్రవహిస్తోంది.

వీఆర్ పురం మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు బంద్

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 10: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వరరామచంద్రపురం మండలంలోని ప్రధాన రహదారులపై వరదనీరు చేరుకోవడంతో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్య వరద నీరు రోడ్డుపై చేరుకుంది. శ్రీరామగిరి గ్రామంలో వరదనీరు ఇళ్లలోకి చేరుకోవడంతో గ్రామస్తులు గుట్టపై నిర్మించుకున్న పునరావాస కేంద్రాల్లోకి సామాన్లతో చేరుకుంటున్నారు. అటు వెంకంపాలెం, చింతరేవుపల్లి, తుష్టివారిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, సోములగూడెం గ్రామాల మధ్యలోగల చింతూరు వెళ్లే ప్రధాన రహదారిపై వరదనీరు చేరుకుంది. వరదల నేపథ్యంలో ప్రభుత్వం అందించిన దోమతెరలు, కందిపప్పు, నూనెను తహశీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి బాధితులకు పంపిణీ చేశారు.

ఏజెన్సీ సమాచారం



గోదావరి ఉధృతితో మంగళవారం వీఆర్‌పురం- ఒడ్డిగూడెం ప్రధాన రహదారిపై చేరిన వరదనీరు - వీఆర్ పురం



మురుమూరు వద్ద ప్రధాన రహదారిపై చేరిన వరదనీరు

ఎటపాక మండలంలో వరద తాకిడి

ఎటపాక, సెప్టెంబరు10: గోదావరి వరద పెరగడంతో ఎటపాక మండలంలో వీరాయిగూడెం -నెల్లిపాక గ్రామాల ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరడంతో మంగళవారం ఉదయం నుంచి ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మరోవైపు మూరుమురు వద్ద ప్రధాన రహదారిపై వరద నీరుచేరడంతో భద్రాచలం- కూనవరం మధ్య రాకపోకలు స్తంభించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సచివాలయ సిబ్బంది సూచించారు.



సీలేరులో జలాశయాలకు తగ్గిన వరద తాకిడి

మోతుగూడెం, సెప్టెంబరు10: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాలకు వరద నీటి తాకిడి (ఇన్‌ఫ్లోస్) తగ్గింది. దీంతో సోమవారం నుంచి జలాశయాల నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీటివిడుదలను జెన్‌కో అధికార్లు క్రమంగా తగ్గించే చర్యలను చేపట్టారు. డొంకరాయి జలాశయానికి వరద నీటి ఇన్‌ఫ్లోస్ 1.10 లక్షల క్యూసెక్కుల నుంచి 87 వేల క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టడంతో జలాశయం నుంచి నీటి విడుదలను 87 వేల క్యూసెక్కులకు మంగళవారం ఉదయం నుంచి తగ్గించారు. ఇక్కడ పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులుకాగా 1029 నీటినిల్వలు ఉన్నాయి. అలాగే సీలేరులోని గుంటవాడ జలాశయానికి కూడా పిల్లిగెడ్డ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ 23వేల క్యూసెక్కుల నుంచి 8వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో ఇక్కడ నీటి విడుదలను కూడా మంగళవారం ఉదయం నుంచి దశలవారీగా తగ్గిస్తూ మధ్యాహ్నం రెండు గంటల సమయానికి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1360 అడుగులు కాగా ప్రస్తుతం 1352 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు మంగళవారం ఉదయం డొంకరాయి, సీలేరు జలాశయాలను పరిశీలించారు. నీటి నిల్వలు, జలాశయాలకు వస్తున్న ఇన్‌ఫ్లోస్ వివరాలను అక్కడ ఉన్న ఇంజనీర్లను, సిబ్బందిని ఆరా తీశారు. జలాశయాలు ప్రమాదస్థాయికి చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ రామభద్రరాజు, ఏడీలు వెంకట మధు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆ దారిలో రాకపోకలు బంద్



నెల్లిమెట్ల వాగు వద్ద సీఐ సన్యాసి నాయుడు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 10: మండలంలో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చాలాచోట్ల పంటపొలాలు నీటమునిగాయి. వాతంగి-లోదొడ్డి గ్రామాల మధ్య ప్రధాన రహదారికి అనుకొని ఉన్న వరిపొలాలకు వరద ఉధృతి ఎక్కువ ఉండడంతో రోడ్డుపైన తారు అలానే ఉన్నా కింద భాగం మొత్తం కోతకు గురైంది. లోదొడ్డి, తదితర గ్రామాలకు వెళ్లేందుకు వేరే మార్గం లేక, అదే రోడ్డుపై ప్రయాణికులు భయపడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. నెల్లిమెట్ల కాలని-లబ్బర్తి గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రహదారిని మంగళవారం సీఐ సన్యాసినాయుడు పరిశీలించి రోడ్డుకు అడ్డుగా తాటి దుంగలు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ నెల్లిమెట్ల కాలనీ - లబ్బర్తి గ్రామాల మధ్యలో కాజ్‌వేకి అనుకొని ఉన్న రోడ్డు కొట్టుకుపోవడంతో ఈ రహదారిని మూసివేశామన్నారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ఆయన సూచించారు.

సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నాయకులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 10: మారేడుమిల్లి నూతన సర్కిల్ ఇనస్పెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ గోపాలకృష్ణను కూటమి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గురుకు శేషకుమార్, జనసేన మండలాధ్యక్షుడు మల్ల దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు బీశెట్టి అప్పాజీ, దూడ సువర్ణ కర్ణకుమార్, కర్రి సన్యాసిరెడ్డి, కొరగాని సువర్ణరాజు, పాము రాంబాబు, జనసేన నాయకులు బీశెట్టి సత్య, పెథకంశెట్టి రాము, డొక్క రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్లు ఎస్టీ అభ్యర్థులతో భర్తీచేయాలి : ఎమ్మెల్సీ

రంపచోడవరం, సెప్టెంబరు 10: రంపచోడవరం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో 2024-26 విద్యా సంవత్సరానికిగాను కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి మెరిట్ ఆధారంగా ఎస్టీ అభ్యర్థులను భర్తీ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పాఠశాల విద్య కమిషనర్‌కు మంగళవారం లేఖ రాశారు. మొత్తం 50 సీట్లకుగాను 32 సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన 18 సీట్లు స్థానిక ఎస్టీ అభ్యర్థులతో భర్తీచేయాలని కోరారు.

ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారట్లేదు : బీజేపీ

రాజవొమ్మంగి, సెప్టెంబరు 10: ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకులు మారట్లేదంటూ బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లిమెట్ల కాలనీ - లబ్బర్తి గ్రామాల మధ్య రోడ్డుకు అనుకొని ఉన్న కాజ్వేపై ఉధృతంగా వరద నీరు ప్రవహించి కాజ్వే పక్కన రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంపై సూరిబాబు మాట్లాడారు. ఈ సమస్యకు ప్రభుత్వంలోనైనా అధికారులు శాశ్వత పరిష్కారం కోరారు.

జేకేటీసీ ద్వారా ఆర్థిక సాయం

కూనవరం, సెప్టెంబరు 10: ఇటీవల విద్యుద్ఘాతానికి మృతిచెందిన కూనవరం మండలం మర్రిగూడుకు చెందిన ఆవల వెంకటరామారావు కుటుంబానికి జేకేటీసీ ద్వారా మరోసారి ఆర్థిక సాయం అందించారు. చనిపోయిన రోజున రూ.5 వేల సాయం అందించగా అనంతరం రూ.6 వేలు విలువగల నిత్యావసర వస్తువులను అందజేశారు. సాయం అందించిన జేకేటీసీ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ జమాల్‌ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు..

వై.రామవరం, సెప్టెంబరు 10: వై.రామవరం మండలం దేవరమడుగుల గ్రామానికి చెందిన లోతా సూర్రెడ్డి(33) ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతని భార్య వెంకటలక్ష్మి వై.రామవరం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 6న ఫిర్యాదు చేసింది. మంగళవారం చవిటిదిబ్బలు, దేవరమడుగుల మధ్యలో మూతిమెట్ట కొండ సమీపంలో ఆ వ్యక్తి చనిపోయి ఓ కొండపై పూడ్చి పెట్టి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

17న అనంత పద్మనాభ స్వామి వ్రతం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10: రాజమహేంద్రవరం సమీపంలోని గాడాలలో శ్రీమహాలక్ష్మి సమేత చిన్నవెంకటేశ్వరస్వామి పీఠంలో ఈ నెల 17న 108 మంది జంటలతో అనంత పద్మనాభస్వామి వ్రతం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి డాక్టర్ చినవెంకన్నబాబు స్వామిజీ తెలిపారు. ఈ మేరకు వ్రత పోస్టరును మంగళవారం రాజమహేంద్రవరం జయశ్రీ గార్డెన్స్‌లో స్వామిజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మతల రమేష్, కూచిమంచి అనంతపద్మనాభ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

» జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కడియం, సెప్టెంబరు 10: రైతులకు విక్రయించే ఎరువులు, పురుగుమందులు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు చెప్పారు. కడియం మండలంలో ఎరువుల షాపులపై అధికారులు పట్టించుకోవడం లేదంటూ, షాపుల యజమానులు ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకాలు చేస్తున్నారని ఇటీవల పలువురు రైతులు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులను ఎమ్మెల్యే గోరంట్ల ఆదేశించారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఎరువుల షాపుల యజమానులు, రైతులతో మంగళవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీపీ అధికారులకు వివరించారు. దీనిపై వారు మాట్లాడుతూ ఎరువుల షాపుల్లో నిల్వల పట్టిక, ఎమ్మార్పీ ధరలు ప్రతిరోజు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు పంటకు ఉపయోగపడే ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవరావు

ప్రభుత్వం నిషేధించిన పురుగుమందులు విక్రయిస్తే షాపు యజమానులపై చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. షాపులను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, పాతూరి రాజేష్, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి ద్వారకాదేవి పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ కోటా తగ్గింపుపై నిరసన

» నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన పీహెచ్‌సీ డాక్టర్లు



రంగంపేట పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన డాక్టర్లు

సీతానగరం, సెప్టెంబరు 10: పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు కేటాయింపులో ఇన్ సర్వీస్ కోటా తగ్గించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ సీతానగరం పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ప్రభుత్వంలో సివిల్ సర్జన్లుగా పనిచేస్తున్న డాక్టర్లు పోస్టుగ్రాడ్యుయేషన్ చేయడానికి సీట్లు కేటాయింపులో ఇన్ సర్వీస్ కోటా 30నుంచి 15కి తగ్గిండం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపినట్టు చెప్పారు. సీట్లు కేటాయింపులో ఇన్ సర్వీస్ కోటా తగ్గించడం అన్యాయమని, ఈ ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.

రంగంపేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు బి.వేణుశ్రీలక్ష్మి, సంకీర్తన, చిన్నారావు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ జీవో 85తో తమ మూడేళ్ల సర్వీసు వృథాగా పోయిందని, అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ జీవోను రద్దు చేయాలని రెండు నెలలుగా అధికారులకు, ఎమ్మెల్యేలకు అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదన్నారు. జీవో 85తో పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమని, ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందన్నారు. ఈ రోజు నుంచి దశల వారీగా తమ ఆందోళనలు చేపడతామని పీహెచ్‌సీ వైద్యాధికారులు చెప్పారు.

ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచండి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 10: తన పాలనా పటిమతో మన దేశాన్ని అగ్ర రాజ్యాల సరసకు తీసుకెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరచేందుకు ప్రతిఒక్కరూ బీజేపీ సభ్యత్వం స్వీకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పీరా రామచంద్రపురంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి స్వయంగా సెల్‌ఫోన్ ద్వారా సభ్యత్వాలు నమోదు చేశారు. రామవరం గ్రామానికి చెందిన మల్లిడి సురేంద్రరెడ్డికి మొట్టమొదటి సభ్యత్వం నమోదు చేశారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపడతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ తేతల సుధాకరరెడ్డి, ఆయన తల్లిదండ్రులు, కర్రి శ్రీనివాసరెడ్డి, మరో 150మంది వైసీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నల్లమిల్లి కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో శివరామకృష్ణంరాజు, కర్రి బులిరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభించినట్టు మండలాధ్యక్షుడు షైలవరపు సాయిరాం తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం సుభద్రంపేటలో ఇంటింటికీ వెళ్లి ఫోన్ ద్వారా 88000 02024 నెంబర్‌కి మిస్డ్‌కాల్ యిప్పించి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయించి పార్టీ సభ్యత్వాలను అందజేశామన్నారు. కార్యకమంలో సర్పంచ్ సాయితాతారావు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రామచంద్రరావు, బందవ, సత్య తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ సుధాకరరెడ్డిని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం

పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10 : సమిష్టి ప్రణాళికతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం కృష్ణసాయి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విలేకరులతో మాట్లాడారు.పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి నేతృత్వంలో అందరు సమన్వయంతో పనిచేస్తామన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. వచ్చే నెల 5న రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని నెలకొల్పుతున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, డీసీసీ మాజీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, కాంగ్రెస్ నాయకులు బెజవాడ రంగారావు, అబ్దుల్లా షరీఫ్, దేవత సుధాకర్, కిషోర్ జైన్, డాక్టర్ వడయార్,ఎం.శారద, డాక్టర్ శ్రీనివాస్ భాస్కర్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ మండల కో-ఆప్షన్ సభ్యుడు రత్నబాబు మృతి



రత్నబాబు(ఫైల్)

రంగంపేట, సెప్టెంబరు 10: క్రిస్టియన్ మైనారిటీ మండల కో-ఆప్షన్ సభ్యుడు, వడిశలేరులోని దైవ సమాజం సంఘ కాపరి పాస్టర్ కొల్లాటి రత్నబాబు(45) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈయన గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయి క్రిస్టియన్ ఫెలోషిప్‌లో అనేక పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాల పాస్టర్లు, సంఘ సభ్యులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

రంగంపేట, సెప్టెంబరు 10: వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద గాని, నిమజ్జనం సమయంలో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కమిటీ సభ్యలపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట కృష్ణసాయి హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చవితి ఉత్సవాలు సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, అందుకు పోలీసులు సహకరిస్తారన్నారు. అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుట్టు,మగ్గంలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 10: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మగ్గం,టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. కోర్సుల్లో ప్రవేశానికి కనీసం పదవ తరగతి లేదా చదవగలిగే వారు అర్హులన్నారు.ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు అడ్మిషన్లకు అవకాశం ఉందన్నారు.45 రోజుల పాటు జరిగే ఉచిత శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని రాంబాబు తెలిపారు. కోర్సులో చేరేవారు ఫోన్ 98498 47489,94907 10850 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కార్మిక సంఘాల ఐక్యవేదిక రాస్తారోకో

పోలీసులు దురుసుగా ప్రవర్తించారని నిరసనకారుల వాగ్వాదం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కోరుతూ మంగళవారం రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. మానవహారం నిర్వహించి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయొద్దు, సొంత గనులు కేటాయించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.జోజి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేటీకరించి కార్పొరేట్లకు దోచిపెడుతున్నదని ఆరోపించారు. పోలీసులు తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని నిరసనకారులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ వాగ్వాదానికి దిగారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.సుందర్‌బాబు, ఎస్ఎస్ మూర్తి, నర్సింహమూర్తి, తులసి, బేబీరాణి, సీపీఎం నగర కార్యదర్శి పవన్, పోలిన వెంకటేశ్వరరరావు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే వాసు



43వ డివిజన్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10: రాజమహేంద్రవరం 43వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 43వ డివిజన్‌లో మంగళవారం పర్యటించారు. కంటిపూడి స్ట్రీట్స్ వద్ద మూడు కల్వర్టులు, రెండు సీసీ రోడ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన మంగళవారం పరిశీలించారు. నగరపాలక సంస్థ అధికారు లతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో కల్వర్టులు సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి నాణ్యతతో నిర్మించాలన్నారు. డివిజన్ టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

కడియం, సెప్టెంబరు 10: దుళ్ల పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై మంగళవారం ఈవోపీఆర్డీ విక్టర్‌బాబు విచారణ చేపట్టారు. అయితే రికార్డులు లేకపోవడంతో 10 రోజుల్లో రికార్డులు అందుబాటులో ఉంచాలని గతంలో పనిచేసిన కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. దుళ్ల పంచాయతీలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, పంచాయతీ కార్యదర్శి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని, దీనిపై విచారణ చేపట్టాలని స్థానిక టీడీపీ నాయకుడు ముమ్మిడి దేవీనాగేశ్వరరావు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యాలయానికి వచ్చి దేవీనాగేశ్వరరావును విచారించారు. పంచాయతీలో రికార్డులు తనకు అప్పగించలేదని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పనిచేసిన కార్యదర్శులు రికార్డులను అప్పగించనందున విచారణ జరపడానికి వీలుపడలేదని విక్టర్‌బాబు తెలిపారు. 10 రోజుల్లో రికార్డులు అప్పగించాలంటూ పూర్వ కార్యదర్శులకు మెమోలు ఇచ్చామన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కడియం, సెప్టెంబరు 10: వీరవరంలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉన్నటుజ్జి విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో మంగళవారం దాడులు జరిపారు. రూ.5,14,347 విలువైన 2,077 కిలోల నిల్వ ఉన్నట్టు గుర్తించారు. రేషన్ బియ్యం రవాణాకు సిద్ధగా ఉన్న వాహనం, కాటాను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. బియ్యం యజమానులు పసలపూడి గంగరాజు, పాబోలు గణపతిలపై కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.నాగవెంకటరాజు తెలిపారు. ఈ దాడుల్లో డీటీ నాగలక్ష్మి, విజిలెన్స్ కానిస్టేబుల్ శివ తదితరులు పాల్గొన్నారు.

వజ్రగణపతికి విశేష పూజలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 10: నందివాడవారి వీధిలో వజ్రగణపతికి మంగళవారం పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని సీసీసీ చానెల్ ఎండీ పంతం కొండలరావు దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మార్కండేయ స్వామి భజనమండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేశారు. ఆలయ పురోహితులు స్వామి వారికి ఏకాదశ హారతులిచ్చారు. కార్యక్రమంలో వాకచర్ల కృష్ణ, పొత్తూరు యతిరాజ్ సంపత్‌కుమార్, సిరిదే ధన వెంకటేశ్వరరావు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో గన్ని కృష్ణ కుటుంబం వితరణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10 : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ సతీమణి గన్ని రాజేశ్వరి సంస్మరణార్థం మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద అన్న క్యాంటీన్‌లో వితరణ చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాలను గన్ని కృష్ణ కుటుంబీకులు ఏర్పాటు చేశారు. గన్ని కృష్ణతో పాటు కుమార్తె అన్నె స్మిత, కుటుంబీకులు పేదలకు భోజనాలు వడ్డించారు.

సాధనతో విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

కేంద్రీయ విద్యాలయ హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోడానికి నిరంతర సాధన చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయ హైస్కూల్‌లో మంగళవారం భారత రాజ్యాంగం, నల్సావారి 'పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సంరక్షణ పథకం-2015'పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు న్యాయ సహాయం అవసరమైతే డీఎల్ఎస్ఏని సంప్రదించవచ్చన్నారు. స్కూల్‌లోని సదు పాయాలు, విద్యా విధానం గురించి కార్యదర్శికి ప్రిన్సిపాల్ వర్గజైన్ వివరించారు. అనంతరం తపాలా శాఖ అధికారులతో ప్రకాశ్‌బాబు సమీక్షా సమావేశం నిర్వ హించారు. నల్సా వెబ్‌పోర్టల్ గురించి విశదీకరించారు. వెబ్‌పోర్టల్ ద్వారా ప్రజలు ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా డీఎల్ఎస్ఏకి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు దరఖాస్తుకు 13 గడువు

సీతానగరం, సెప్టెంబరు 10: సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ చిక్కం దొరబాబు మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో పౌరశాస్త్రం(సివిక్స్) పోస్టు ఖాళీగా ఉందని, ఈ సబ్జక్టులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. వీరికి గంటకు రూ.150 చొప్పున గరిష్టంగా నెలకు రూ.10 వేల వరకు చెల్లించనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను జతపర్చి ఈ నెల 13లోపు కళాశాలలో అందజేయాలన్నారు. బోధనా పటిమ ఆధారంగా అభ్యర్థిని ఎంపిక చేస్తామని చెప్పారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలి

జీజీహెచ్ ఎదుట ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 : తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు మంగళవారం కూడా ఆందోళన చేపట్టారు. ఈ మేరకు జీజీహెచ్ ఓపీ ఎదురుగా నిరసనకు దిగి తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. జీవో నెం.115 రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు.ఆందోళనకు జీజీహెచ్ హెడ్ నర్సులు సత్యవతి, జ్యోతి, సరళకుమారి, ఇందిరాబాబి, ఉమ మద్దతు తెలిపారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు అంజలి, లక్ష్మి, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

సీతానగరం, సెప్టెంబరు 10: గణపతి విగ్రహాల నిమజ్జనం చేయడానికి కేటాయించిన ర్యాంపుల్లో ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో రమేష్, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండలంలోని వంగలపూడి, ముగ్గుళ్ల, మునికూడలి, జాలిమూడి రేవుల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి రేవులను కేటాయించినట్టు చెప్పారు. అక్కడ ఆయా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు రేవుల్లో విద్యుత్ లైట్లు, ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నానికి విగ్రహాలు నిమజ్జనం పూర్తి చేయాలని, అధిక సంఖ్యలో భక్తులు దిగడానికి అనుమతించవద్దని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్ ఫార్మశీ కళాశాల స్నాతకోత్సవం

విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానం

కోరుకొండ, సెప్టెంబరు 10: మండలంలోని నిడిగట్ల వికాస్ ఫార్మశీ కళాశాలలో మంగళవారం స్నాతకోత్సవం నిర్వహించారు. కళాశాలలో డాక్టర్ ఆఫ్ ఫార్మశీ, బ్యాచులర్ ఆఫ్ ఫార్మశీ చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, డాక్టర్ పీవీ నారాయణ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ తస్నీరు వెంకటనారాయణ మాట్లాడుతూ ఫార్మశీ విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ పి.భరత్ వికాస్, డాక్టర్ వడ్లమూడిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మురళీధర్, డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ బి. మధుహారిక పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు విరాళాల సేకరణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితుల సహా యార్థం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు, యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. దేవీచౌక్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో నగర ప్రజలు, వర్తకులు, దాతల నుంచి ధనం, వస్త్రాలు వంటివి సేకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ సేకరించిన విరాళాలను విజయవాడ పంపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రాచీన ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బిక్కవోలు, సెప్టెంబరు 10: బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయానికి, మంగళవారం కావడంతో శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రజ, కుజ, సర్ప దోష నివారణార్థం సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామి దర్శనానికి వచ్చిన రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించామని ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.చవితి ఉత్సవాలు నాలుగో రోజు కావడంతో లక్ష్మీగణపతిని భక్తులు దర్శించుకున్నారు.



ఎమ్మెల్యే గోరంట్లకు వినతిపత్రం అందజేస్తున్న నర్సరీ సంఘం ప్రతినిధులు

ఎమ్మెల్యే గోరంట్లను కలిసిన నర్సరీ సంఘం

కడియం, సెప్టెంబరు 10: నర్సరీ ప్రతినిధి, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీలకు మట్టిని తీసుకువచ్చే సమయంలో రైతులకు అధిక బారం పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మైనింగ్ బిల్లు వల్ల ప్రస్తుతం మట్టి నర్సరీకి వచ్చే సరికి రూ.2 వేలు అదనంగా అవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పెనుమాక కొండబాబు, గాద నాగేశ్వరరావు, గట్టా కృష్ణ భగవాన్, రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళి, జంగా సుబ్బారావు, గరగ నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్ పాల్గొన్నారు.



ఊరంతా నీళ్లే : కిర్లంపూడి మండలం రాజుపాలెంలో నీట మునిగిన వీధులు



ఉగ్ర గోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద ఉధృతి

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద దిగువకు 11,55,027 క్యూసెక్కులు విడుదల

తగ్గినట్టే తగ్గి.. పెరిగిన గోదారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : గోదావరి వరద పోటె త్తింది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి మహోగ్రరూపం దాల్చింది.కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ప్రమాదస్థాయికి చేరుకుంది. గోదావరి తీర ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రెండు రోజుల కిందట వరద తగ్గిందని ఊపిరిపీల్చుకునే లోపే గోదావరికి మరలా వరద పోటెత్తింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, ఉపనదులు పొంగి పొర్లుతున్నాయి. నదిలో వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో వరద తగ్గినట్టే తగ్గి ఒక్కసారిగా ఉధృతంగా పెరిగింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం రాత్రికి వరద నుంచి పూర్తిగా బయటపడిన స్నానఘట్టాలు 24 గంటల్లో మరలా వరద ప్రవాహం ముంచెత్తింది. మంగళవారం రాత్రి 11 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 11 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు గోదావరి రివర్ కన్జర్వేటర్, హెడ్‌వర్క్స్ ఈఈ కె.కాశీ విశ్వేశ్వరరావు ప్రకటించారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు ఇక్కడ నీటి మట్టం 49.80 అడుగులుగా ఉంది.ఇది మరింత పెరిగే అవ కాశం ఉంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 12 గంటలకు నీటిమట్టం 13 అడుగులకు చేరడంతో 11,55,027 క్యూసెక్కుల వరదను 175 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.అది అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంకలను ముం చెత్తుతూ సముద్రంలోకి పోతోంది. గోదావరి పాండ్ లెవల్ 14.25 మీటర్లకు పెరి గింది. కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవా రం నాటికి రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉందని వరద నీరు 12 లక్షల నుంచి 13 లక్షల క్యూసెక్కుల చేరే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. గోదావరి ఎగువ ప్రాంతాలైన భద్రాచలం, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి భారీ వరద వస్తుందని తెలిపారు. రాజమహేంద్రవరంలోని కలె క్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళ వారం ఆమె క్షేత్రస్థాయి సమన్వయాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావొచ్చన్నారు. ముంపు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తర లించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాజ మహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లలో అత్య వసర పనులకు కార్యాచరణ సిద్ధం చేసి వెం టనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.రెండు డివిజన్లలో 6 పనులకు ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చారు. రాజమహేంద్రవరం, సీతానగరం, నిడద వోలు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో ముంపు ఎక్కు వగా ఉంటుందని,అక్కడి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిం చాలని జేసీ ఎస్.చిన రాముడు ఆదేశించారు. పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

జల వలయం



వరదలో హై..వే : గొల్లప్రోలులో టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఉధృతంగా వెళుతున్న వరద నీరు

- కాకినాడ జిల్లాలో ఏలేరు..కన్నీళ్లు
- 7 మండలాల్లో 62 గ్రామాలు మునక
- ఎక్కడికక్కడ కాలువలకు గండ్లు
- ఐదు మండలాల ప్రధానరహదారులు మూత
- నీట మునిగిన 45 వేల ఎకరాలు
- ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి
- రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద
- కోనసీమలో లంకలు మునక
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ముంచిన ఏలేరు.. ఉప్పొంగుతున్న గోదారి



దారేది : పి.గన్నవరం మండలంలో కనకాయలంక కాజ్‌వేపై వరద

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎటుచూసినా వరద.. ఊళ్లన్నీ ఏరులై.. చేలన్నీ చెరువులై.. ఉదయం కనిపించిన రోడ్లు, ఇళ్లు మధ్యాహ్నానికి వరదలో మాయమయ్యేంత జల ప్రళయం.. జిల్లాలో ఏలేరు వరద మంగళవారం భయోత్పాతం సృష్టించింది. అంచనాలకు అందని జలవిలయంతో ముంచెత్తింది. దీంతో జిల్లాలో ఏడు మండలాల్లో 62 గ్రామాలు వరదలో చిక్కుకుని విలవిల్లాడాయి. 45 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నిండా మునిగాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచీ ఏలేరు వరద మరింత పోటెత్తడంతో పిఠాపురం, గొల్ల ప్రోలు, ఏలేశ్వరం, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, కొత్తపల్లి, సామర్లకోట మండలాల్లో వరద ముంపు భారీగా పెరిగింది. అనేక ప్రధాన రహదారులపై నీళ్లు పొంగుతూ ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. పిఠాపురంలోని రాపర్తి నుంచి గొల్లప్రోలు టోల్‌గేట్ మధ్యలో 216 జాతీయ రహదారిపై వరద నీరు చొచ్చుకొచ్చేసింది. దీంతో ఒకవైపు ప్రయాణాలు నిలిపివేశారు. దీనివల్ల భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఏలేరు నుంచి దిగువకు 42 వేల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల చేయడంతో వరద కాలువల్లో పోటెత్తి ఎక్కడికక్కడ గండ్లు పడి తీవ్ర నష్టంవాటిల్లింది. ప్రత్తిపాడు,కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం మండలాల ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండ డంతో తాత్కాలికంగా మూసివేశారు. ముంపు గ్రామాలు విద్యుత్ లేక అంధకారంలో ఉన్నాయి.వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలకోసం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగం దిగాయి.

8 మండలాల్లో వరద ప్రభావం

- గొల్లప్రోలు మండలంలో ఏలేరు వరద నష్టం తీవ్రంగా ఉంది.ఏలేరు కాలువకు ఆరు చోట్ల గండ్లు పడ డంతో 8,500 ఎకరాల్లో పంటలు,10 గ్రామాలు నీటముని గాయి. గొల్లప్రోలు-తాటిపర్తి,చెందుర్తి-తాటిపర్తి రోడ్లు మూసివేశారు. వరద ఉధృతికి పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్లే దారిలో రాపర్తి నుంచి టోల్‌గేట్ వరకు వరద జాతీయ రహదారిపైకి వచ్చేసింది.ఈ దారిలో రాత్రి 8 గంటల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపియడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. గొల్లప్రోలు,పిఠాపురం శివారు ప్రాంతాల్లో అనేక కాలనీలను వరద ముంచడంతో బాధితులు ఆకలితో అలమటించారు.
- పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు 9 చోట్ల గండ్లు పడడంతో 14 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగా యి. వరదనీరు ప్రధాన రహదారులపైకి వచ్చేయడంతో గొల్లప్రోలు-బి.ప్రత్తిపాడు,పిఠాపురం-రాపర్తి, పిఠాపురం- నరసింగపురం- జములపల్లి,పిఠాపురం-గోకివాడ మధ్య రాకపోక లు నిలిచిపోయాయి. 15 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి.
- కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువకు మొత్తం పది చోట్ల గండ్లు పడడంతో 16 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మొత్తం 21 గ్రామాల్లో వరద చేరింది. రాజుపాలెంలో వందలాది కుటుంబాలు నరక యాతన పడుతున్నాయి.రాజుపాలెం-ముక్కోలు, గెద్దనాపల్లి- భూపాలపట్నం,భూపాలపట్నం-ఎస్.తిమ్మాపురం- బూరుగుపూడి, సోమరాయణపేట, పాలెం వరకు రాకపోకలు నిలిపివేశారు.
- ప్రత్తిపాడు మండలంలో ఏలేరు కాలువకు గండి పడడంతో 1,200 ఎకరాలు నీట మునిగింది.వరదలకు పెద్దిపాలెం, వేము లపాలెం,ధర్మవరం, వెల్చర్తి రహదారులు మునిగాయి. సుబ్బారెడ్డిసాగర్ కాలువలకు గతంలో పడ్డ గండ్లు తాజా వరద లతో మరింత ఎక్కువయ్యాయి.
- ఏలేశ్వరం మండలంలో 2,800 ఎకరాలు నీటమునిగాయి. ఎర్రవరం,తిరుమాలి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.
- పెద్దాపురం మండలంలో ఏలేరుకు ఒక చోట గండిపడి 4,300 ఎకరాలు నీటమునిగాయి.మర్లావ వరదలో చిక్కుకుంది.పెద్దాపురం నుంచి కాండ్రకోట రాకపోకలు నిలిపేశారు.
- సామర్లకోట మండలంలో ఏలేరు వరద కారణంగా పంట పొలాలు నీటమునిగాయి. టిడ్కో గృహాల వద్ద భారీగా వరద నీరు చేరింది. ఉప్పువారి సత్రం నుంచి జల్లూరు వరకూ 8 కి.మీ మేర వరదనీరు చేరింది. సామ ర్లకోట-పిఠాపురం మధ్య ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిపివేశారు.
- కొత్తపల్లి మండలంలో 800 ఎకరాల్లో పంట నీట మునిగింది.

కోనసీమలో భయంభయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద ఉగ్ర రూపం దాల్చడంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. గోదావరి వరద ఉధృతి కారణంగా కోనసీమలోని గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో ప్రవాహ వేగం పెరుగుతోంది. ఇప్పటికే ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 7 గంటలకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో నదీపాయలన్నీ పొంగి పొర్లుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన చాకలిపాలెం కనకాయలంక కాజ్‌వే జలదిగ్బంధానికి గురైంది. సమీపంలోని లంక ప్రాంతాలను వరద ప్రవాహం ముంచెత్తుతోంది. నదీపాయలను ఆనుకుని ఉన్న కాజ్‌వేలు ముంపు బారిన పడడంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. వరద పెరుగుతున్నందున కొన్నిచోట్ల విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతోంది. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నారు. కుండలేశ్వరం సమీపంలో కుంగిన గట్టు వద్ద గడ్డర్లు ఏర్పాటుచేసి వాహనాలు వెళ్లకుండా అధికారులు నిరోధించారు. సముద్రపు మొగల వద్ద అలల ఉధృతి తీవ్రంగా ఉంది. ప్రధానమైన రేవుల్లో పరిస్థితిని బట్టి పంట్లు, పడవలపై రాకపోకలు సాగించాలని, వరద పెరిగితే తక్షణం నిలుపుదల చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులు ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అటు ప్రజలను, ఇటు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కోనసీమ జిల్లాకు కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం 17 పాయింట్లలో జరుగుతున్న ప్రయాణికుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. పడవలపై ప్రయాణం చేయాలనుకునే వారికోసం లైఫ్ జాకెట్లు, గత ఈతగాళ్లను సిద్ధం చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ సమయంలో జి.పెదపూడి వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేయగా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే 44 ప్రాంతాల్లో పునరావాసాల్లో ఏర్పాటు చేయనున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి వెళ్లే కాజ్‌వే వద్ద పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. మరోవైపు గోదావరి నదీ పరివాహక లంక గ్రామాల్లోని విద్యా సంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. రాగల 72 గంటల పాటు అధికార యంత్రాంగం అప్రమత్తతతో పనిచేయాలని, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

శాంతించిన బురదకాలువ

గోకవరం, సెప్టెంబరు10: భారీ వర్షాల కారణంగా గోకవరం మండలంలో వందలాది ఎకరాలు నీటమునిగాయి. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో బురదకాలువ, ఊరకాలువ ఉప్పొంగాయి. దీంతో వందలాది ఎకరాల్లో పొలాలు ముంపుబారిన పడి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయితే మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో బురదకాలువ, ఊరకాలువ శాంతించాయి.దీంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.గాదెలపాలెంలో ఇసుకపల్లివారి చెరువు నుంచి నీరు పారే కాలువకు పడిన గండి నీట మునిగిన పంట పొలాలను మంగళవారం తహశీల్దార్ వై.సరస్వతి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, వీఆర్వోలు పరిశీలించారు. పూర్తి స్థాయిలో ముంపు తగ్గితేనే గాని పంట నష్టాన్ని అంచనా వేయలేమని తహశీల్దార్ పేర్కొన్నారు.



గోకవరం మండలం గాదెలపాలెంలో ఇంకనూ ముంపులోనే పంట పొలాలు

తేరుకున్న శ్రీరంగపట్నం


కోరుకొండ, సెప్టెంబరు 10 : బురద కాలువ ఉప్పొంగి గండ్లు పడడంతో రెండు రోజులు కిందట ముంపుబారిన పడిన శ్రీరంగపట్నం గ్రామం మంగళవారం సాయంత్రానికి తేరుకుంది. యానాదులపేట,ఎస్సీ పేట, బీసీ కాలనీలు ముంపు నుంచి బయటపడ్డాయి.దీంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. వరదనీరు తగ్గినప్పటికీ రోడ్లు బురదమయంగా మారాయి.కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఉండడం వల్ల జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం కొనసాగిస్తున్నట్టు తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. గ్రామంలో 4 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్తులకు అవసరమైన మందులు,ఇతరసహాయక చర్యలు అందజేశారు. సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ, మద్దాల రమణ ఆధ్వర్యంలో వీధులను శుభ్రం చేయిస్తున్నారు.



శ్రీరంగపట్నంలో ఇళ్ల మధ్యన వరదనీరు

ఆకారంలో పులి.. జాతిలో పిల్లి!





పులి బోనులో చిక్కలేదు..ఐదు రోజులైనా టెన్షన్ వీడలేదు.. నగరంలోకి వచ్చేస్తుందేమో వస్తే ఏం చేయాలి.. జాతీయ రహదారిపై వెళుతుంటే దాడి చేస్తుందేమో.. ఒక వేళ వస్తే ఏం చేయాలి.. ఇలా రకరకాల ప్రశ్నలతో సతమతమవుతున్నారు. భయంభయంగా ఉన్నారు.. అటవీ అధికారులు హైవేను ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్టు వద్ద కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా పులి అడవిలోనే ఉందని చెప్పి మా పని అయిపోయిందన్నట్టు ప్రవర్తిస్తున్నారు..చిరుత పులి ప్రవర్తన ఎలా ఉంటుంది.. ఏఏ జంతువులపై దాడి చేస్తుంది.. తదితర వివరాలతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చిరుత పులి ఎక్కడ నుంచి వచ్చింది.. ఎలా వచ్చిం దనేది పెద్ద ప్రశ్నగా మారింది. రాజమహేంద్రవరం శివా రు రాజానగరం, దివాన్‌చెరువు పరిధిలో సుమారు 900 ఎకరాల రిజర్వు ఫారెస్టు ఉంది.ఈ ఫారెస్టులో శుక్ర వారం నుంచి అంటే గత ఐదు రోజులుగా చిరుత సంచరి స్తోంది.ఈ ప్రాంతం లాలాచెరువు హౌసింగ్ బోర్డుకు సమీపంలో ఉంది. ఆకాశవాణి కేంద్రం నుంచి పడమర వైపుగా చిరుత వస్తే రాజమహేంద్రవరంలోకి వచ్చే ప్రమాదం ఉంది.దిశ మార్చుకుంటే అటు లాలా చెరువు, ఇటు శ్రీరాంపురం వైపు వెళతుంది. దీంతో రిజర్వు ఫారెస్టు చుట్టూ ఉన్న జనం ఆందోళన చెందుతున్నారు.

చిన్న జంతువులే ఆహారం..

చిరుతలు..పులుల మాదిరిగా దూకుడుగా మనిషిపైకి దూకే స్వభావం ఉండదు..అదిలిస్తే ప్రాణ భయంతో దాడి చేస్తాయి.ఎందుకంటే చిరుతలు పిల్లి జాతికి చెందిన వన్య ప్రాణులు. కాబట్టి లక్షణాలు పిల్లి లాగే ఉంటాయి.అయితే వన్య మృగం కాబట్టి ఆహారానికి వేటాడే స్వభావం ఉంటుంది.ఇళ్లల్లో తిరిగే పిల్లి నడవడికకు దగ్గరగా చిరుత ఉంటుంది. చెట్లు సులభంగా ఎక్కుతుంది. పులి అంత క్రూరంగా వేటాడదు. చాలా సులభంగా వేటాడి చెట్టుపైకి తీసుకెళ్లి రోజుల తరబడి తింటుంది. వేటకు వాసననే ఆయుధంగా ఉపయోగిస్తుంది. చిరుతకు పరిమాణం తెలుస్తుంది.దానిని బట్టి వేటాడే పద్ధతిని మార్చుకుంటుంది.పాద ముద్రలు చూసి జంతువులను గుర్తు పడుతుంది. చిరుతలు ఎక్కువగా మేకలు, గొర్రెలు, దూడలు, కోళ్లు,నక్కలు, కోతులు వంటి వాటిని వేటాడుతుంటాయి. అం దువల్ల శివారు ప్రాంతాల్లో, గ్రామాల్లోని మేకలు, గొర్రెల మందలు లేదా వాటిని కట్టేసే చోట జాగ్రత్తగా ఉండాలి.రాత్రి వేళల్లో గమనిస్తూ ఉండాలి.

ఇదీ చిరుత జీవన విధానం..

చిరుతపులి 2-5 రోజులకొకసారి వేటాడ తాయి. మూడు నాలుగు రోజులకొకసారి నీళ్లు తాగు తాయి.ఎక్కువగా ఉదయం,సాయంత్రం, రాత్రి వేళల్లో ఆహారానికి అన్వేషిస్తాయి. చీతాలు మని షిని వేటాడిన సందర్భాలు అరుదని నిపుణులు చెబుతున్నారు. నిర్మానుష్యప్రదేశంలో నక్కి ఉంటాయి. ఒక్కరోజులో 20-30 కిలోమీటర్లు సంచరిస్తుంది. ప్రస్తుతం చిరుత వేటాడి ఐదు రోజులు దాటింది కాబట్టి మళ్లీ ఆహారానికి లేదా నీటి కోసం ప్రయత్నించే అవకాశం ఉంది.మేకలు, కోతులు దీనికి ఇష్టాహారంగా చెబుతారు.రిజర్వు ఫారెస్టులో కోతుల సంచారం ఎక్కువ.అంటే ఆహారానికి ఇబ్బందిలేదు.

- ఐదు రోజులైనా చిక్కని చిరుత
- భయంభయంగా జనం
- రక్షణ చర్యలు చేపట్టని అటవీ శాఖ
- మనుషులపై దాడి అరుదు
- చిరు జంతువులే టార్గెట్
- ఐదు రోజులకోసారి వేట
- పిల్లిలాగే చిరుత పులి తీరు
- ఏజెన్సీలో 300 చిరుతలు

వచ్చింది ఒంటరిగానా? జంటగానా?

ప్రస్తుతం రాజమహేంద్రవరం శివారులో కనిపించిన చిరుత ఒంటరిగా వచ్చిందా? జంటగా వచ్చిందా? అనే అనుమానాలున్నాయి.ఉమ్మడి తూర్పుఏజెన్సీలో 300 వరకూ చిరుతపులులు మారేడుమిల్లి, వై.రామవరం, రంపచోడవరం, గుర్తేడు, పాతకోట, భద్రాచలం ఘాట్ ఏరియా, దేవీపట్నంపైన మంటూరు, అడ్డతీగల, రాజ వొమ్మంగి అటవీ ప్రాంతాల్లో ఉన్నాయని అంచనా. ఇవి ఒక్క ఈతలో గరిష్టంగా ఆరు పిల్లలకు జన్మ నిస్తాయి. కొంతకాలంగా తూర్పు మన్యంలో చిరుతల సంచారం పెరిగిందనే అంచనాలున్నాయి.ఆహార అన్వేషణలో భా గంగా ఇవి సంచరిస్తూ జనావాసాల్లోకి వచ్చేస్తుంటా యి. చిరుతలు ఏడాదిలో 9 నెలలు ఒంటరిగానే సంచ రిస్తాయి. జతకట్టే సమయంలో మాత్రమే జంటగా ఉం టాయి.చిరుతలకు సాధారణంగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలలు క్రాసింగ్ సమయం. పైగా ఇవి పులి మాదిరిగా దట్టమైన అడవుల్లో కాకుండా జనావాసాలకు కాస్త దగ్గరగానే పిల్లలకు జన్మనిస్తాయి.ఇక్కడ మగ చిరుత సంచరిస్తుందని నిర్ధారణకు వచ్చారు.దీం తో ఇప్పుడు రాజమహేంద్రవరం శివారుకు ఒంటరి చిరుత వచ్చిందా?జంట వచ్చిందా? అనే విషయం తేలాల్సి ఉంది.



గంటకు 110 కి.మీ వేగం..

ఒలింపిక్ ఛాంపియన్ ఉసేన్ బోల్ట్ గరిష్ఠంగా గంటకు 44.72 కిలో మీటర్ల వేగంతో పరుగెత్తితే..చిరుతలు గంటకు 110 కిలోమీర్ల వరకూ వేగాన్ని అందుకుంటాయి. భూమిపై ఉన్న జంతువుల్లో పరుగులో చిరుత మొదటి స్థానంలో ఉంది. ఒక్క ఉదుటలో ఏడు మీటర్లు దూకుతుంది. కేవలం మూడు సెక న్లలో గరిష్ఠ వేగాన్ని అందుకుంటాయి. పరుగు సమయంలో చిరుత శరీరం అంతా కదులుతున్నా కళ్లు మా త్రం స్థిరంగా వేటా డే జీవిపై కేంద్రీకృతమై ఉండడం వంటి ప్రత్యేకత.

టీడీపీ నాయకులు స్పందించారు..

గోపాలపురం నుంచి రూ.58.58 లక్షలు సహాయం



గోపాలపురం/నల్లజర్ల, సెప్టెంబరు 10 : వరద బాధితుల సహాయ నిధికి రూ. 58,58,999లు విరాళం అందజేసినట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి డీడీని అందజేశారు. గోపాలపురం నియోజకవర్గం నాలుగు మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. నల్లజర్ల మండలం నుంచి రూ.20,75,613,ద్వారకాతిరుమల రూ.17.25 లక్షలు, గోపాలపురం రూ.11,38,386, దేవరపల్లి రూ.92 వేలు ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు.నాలుగు మండలాల టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, లంక సత్యనారాయణ,తాతిన సత్యనారాయణ, రొంగళ సత్యనారాయణ పాల్గొన్నారు.

జీవో 85 రద్దుకు పీహెచ్‌సీ వైద్యుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 : పీహెచ్‌సీ వైద్యులకు నష్టం వాటిల్లేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.85 రద్దు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) జిల్లా అధ్యక్షురాలు మౌనిక డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులంతా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపామని అన్నారు. బుధ, గురువారాల్లోనూ నిరసన కొనసాగిస్తామన్నారు. 14న పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలకు మాత్రమే పరిమితం అవుతామని, 15న చలో విజయవాడ డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి ర్యాలీగా వెళతామని తెలిపారు. 16వ తేదీ నుంచి జీవో 85 రద్దు అయ్యే వరకూ నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ వైద్యులకు అర్హతతో కూడిన పీజీ సీట్లలో పాత జీవో ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనకు శిక్షణ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతే ఆన్‌లైన్ మోసాలకు మొదటి ఆయుధమని.. సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ సిబ్బందికి రెండు రోజుల పాటు కర్నూలుకు చెందిన తెలుగు సైబర్ ఆర్మీ సీఈవో రామాంజనేయులు బృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మోసపూరిత లోన్ యాప్‌లను ఫోనుల్లో ఇన్‌స్టాల్ చేయరాదన్నారు. సైబర్ నేరానికి గురయ్యామని గుర్తించిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడంతోపాటు cybercrime.gov.in వెబ్‌సైటులో ఫిర్యాదు చేయాలన్నారు.

సెప్టెంబరు 9ని చీకటిరోజుగా గుర్తించాలి

- చంద్రబాబును వైసీపీ జైలుకు పంపించి ఏడాది
- నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే కూటమి ధ్యేయం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్



కొవ్వూరు, సెప్టెంబరు 10: చంద్రబాబును జగన్‌రెడ్డి తప్పుడు కేసులతో అరెస్టు చేసిన 2023 సెప్టెంబరు 9వ తేదీని చీకటిరోజుగా ప్రజలు గుర్తించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అన్నారు. మంగళవారం కొవ్వూరులోని ఆయన నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. జవహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపుతో చంద్రబాబును జైలుకు పంపించి ఏడాది పూర్తయ్యిందన్నారు. చంద్రబాబు సుదీర్ఘ రాజకీయ అనుభవంతో రాష్ట్రం కోసం 40ఏళ్లకు పైగా పనిచేస్తున్నారన్నారు. ఐదేళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే, వేధింపులు, కక్ష సాధింపు చర్యలతో వైసీపీ పాలన సాగిందన్నారు. ఈ క్రమంలోనే తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును సెంట్రల్ జైలుకు పంపించారన్నారు. ఏ ప్రజా ప్రతినిధి అయినా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అరెస్టు చేయాలంటే 17ఏ చట్టం ప్రకారం గవర్నర్ అనుమతులు తీసుకోవలసి ఉన్నప్పటికీ నిబంధనలను ఉల్లంగించి దాదాపు 52 రోజులు జైల్లో చంద్రబాబును నిర్బంధించారన్నారు. సైకో పాలన నుంచి వియుక్తి పొందిన తరువాత ఆయన రాష్ట్రాభివృద్ధికి ఏ విధంగా పరితపిస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. పది రోజులుగా విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడానికి ముఖ్యమంత్రి కలెక్టరేట్‌నే సీఎంవోగా చేసుకుని అహర్నిశలు ప్రజల కోసం కష్టపడుతున్నారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడికి మంత్రి లోకేశ్ అభినందన



కొవ్వూరు, సెప్టెంబరు 10: వరద సహాయక చర్యల్లో భాగంగా 95శాతం పారిశుధ్య పనులు చేయించడంపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అభినందించారు. విజయవాడలోని రణధీర్‌నగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి పలు ప్రాంతాలను సందర్శించి ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను పరిశీలించారు. పారిశుధ్యం, నిత్యావసరాల పంపిణీ, వైద్య శిబిరాల నిర్వహణ, ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కృష్ణలంక రణధీర్‌నగర్‌లో 95శాతం పారిశుధ్యం మెరుగుపర్చడంతో మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడిని లోకేశ్ అభినందించారు.

చివటంలో వినాయక విగ్రహం వేలం

రూ.2.05 లక్షలకు దక్కించుకున్న గ్రామస్థుడు



వినాయక విగ్రహం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 10: మండలంలోని చివటం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహానికి వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఈడ్పు గంటి శ్రీనివాస్ రూ.2.05 లక్షలకు హెచ్చుపాటగా దక్కించుకున్నారు. దీంతోపాటు మరో మట్టి విగ్రహాన్ని వేలం వేయగా కరుటూరి సోమయ్య రూ.20 వేలకు పాడుకున్నారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని కలిసిన బాపూజీ

కొవ్వూరు, సెప్టెంబరు 10: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన టీకే విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణకుమారిలను పార్టీ కొవ్వూరు అధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో విశ్వేశ్వరరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆయేషా

ఉండ్రాజవరం, సెప్టెంబరు 10: స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యురాలు ఆయేషా బేగం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్, సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, సీహెచ్ఎస్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వాంబేకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

మహిళల ఆందోళన..మున్సిపల్ కార్యాలయానికి వినతి



సమస్యలపై ఆందోళన చేస్తున్న వాంబేకాలనీ మహిళలు

కొవ్వూరు, సెప్టెంబర్ 10: వాంబేకాలనీలో సమస్యలను పరిష్కరించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాంబేకాలనీలో వర్షపునీరు నిలిచిపోయి అపారిశుధ్యం నెలకొందన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, దీంతో పాములు, విష పురుగులు రోడ్లపై సంచరిస్తున్నాయన్నారు. ఖాళీస్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విష పురుగులు తిరుగుతున్నాయన్నారు. సమస్యలపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. వారం రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. సమాచారం తెలుసుకున్న ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి వాంబేకాలనీలో సమస్యలను పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎ.సత్యవతి, పి.వెంకటలక్ష్మి, పి.గంగారత్నం, ఎం.సుబ్బాయమ్మ తదితర 20 మంది మహిళలు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు సుబ్బారావుకు సత్కారం



చాగల్లు, సెప్టెంబరు 10: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చాగల్లు-నెల టూరు వర్తక సంఘం వారి సంపత్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద రంగస్థల నటుడు డీవీ సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు స్వర్ణహస్త కంకణం తొడిగారు. హరిశ్చంద్రుడు సహా పలు పౌరాణిక నాటకాలతో ఆయన గుర్తింపు, గౌరవరం పొందారని అభినందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు, సభ్యులు జాను గంగారావు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఏటా గణపతి నవరాత్రులు నిర్వహిస్తూ కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారులను గౌరవించడం సంతోషంగా ఉందని సుబ్బారావు అన్నారు.

17న అనంత పద్మనాభ స్వామి వ్రతం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10: రాజమహేంద్రవరం సమీపంలోని గాడాలలో శ్రీమహాలక్ష్మి సమేత చిన్నవెంకటేశ్వరస్వామి పీఠంలో ఈ నెల 17న 108 మంది జంటలతో అనంత పద్మనాభస్వామి వ్రతం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి డాక్టర్ చినవెంకన్నబాబు స్వామిజీ తెలిపారు. ఈ మేరకు వ్రత పోస్టరును మంగళవారం రాజమహేంద్రవరం జయశ్రీ గార్డెన్స్‌లో స్వామిజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మతల రమేష్, కూచిమంచి అనంతపద్మనాభ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండండి

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్
- కొవ్వూరు గోష్పాదక్షేత్రం, యర్నగూడెంలో గండి చెరువు పరిశీలన

కొవ్వూరు, సెప్టెంబరు 10: గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉన్నందున నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం రాత్రి కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని ఎస్పీ బి.నరసింహ కిషోర్‌తో కలిసి ఆమె సందర్శించారు. గోదావరి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువన భద్రాచలంలో 48 అడుగుల వరద ప్రవాహం నమోదయ్యిందని, ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారని చెప్పారు. బుధవారం సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో 14 లక్షల వరద ప్రవాహం బ్యారేజ్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. గోదావరి ఏటిగట్ల వెంబడి నీటి ప్రవాహం ఉధృతంగా ఉందని, తీర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను, దేవాలయాల నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఎవ్వరు నదిలో దిగరాదన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున తీర ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. వినాయక నిమజ్జనాలు మరో రెండు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. అనంతరం వినాయక నిమజ్జనాలకు చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

గోష్పాదక్షేత్రంలో ఆక్రమణలపై దృష్టి సారించాలి

కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని సబ్ కలెక్టర్



గండి చెరువు వద్ద రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబులకు కలెక్టర్ సూచించారు. గత పుష్కరాల రికార్డులను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలన్నారు. అనంతరం క్షేత్రంలో నరికివేసిన దేవతా వృక్షాన్ని పరిశీలించారు. చెట్టును నరికివేసిన వారిపై కేసు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గత నెల 7న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వీఆర్వో ఫిర్యాదు చేశారని, అయితే పోలీసులు కేసునమోదు చేయలేదని కలెక్టర్‌కు తెలియజేయగా వెంటనే కేసునమోదు చేయాలని పట్టణ సీఐ పి.విశ్వంకు కలెక్టర్ సూచించారు.



పెరవలి: తీపర్రులో వరద ఉధృతి

మున్సిపల్ ఏఈపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

గోష్పాదక్షేత్రంలో విద్యుత్ దీపాలు సరిగా వెలగకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ మున్సిపల్ ఏఈ సుమంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మున్సిపల్ సేవలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌కుమార్, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తదితరులున్నారు.

తహశీల్దార్.. ముంపు ప్రాంతాల పరిశీలన

అఖండ గోదావరి నదికి మరలా వరద పోటెత్తడంతో మండలంలోని ముంపు ప్రాంతాలను ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు సిబ్బందితో పరిశీలించారు. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద పెరుగుతుండడంతో మండలంలోని మద్దూరులంక, పల్లిపాలెం గ్రామస్థులను ఆయన అప్రమత్తం చేశారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున పల్లిపాలెంలో నివసిస్తున్న 17కుటుంబాలకు చెందిన 42 మంది అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిరావాలన్నారు. మద్దూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి ఎగువ నుంచి అధికంగా వరద ప్రవాహం వస్తున్నందున దవళేశ్వరం వద్ద మరింత నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరద ప్రవాహం మరింత పెరిగితే పల్లిపాలెం, మద్దూరులంక గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.



గోష్పాదక్షేత్రంలో వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్

గండ్లు పడితే సత్వరం చర్యలు చేపట్టాలి : కలెక్టర్

దేవరపల్లి, సెప్టెంబరు 10: ఇదిలా ఉండగా యర్నగూడెం శివారు గండి చెరువును కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కాల్వల్లో గండ్లు పడితే వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గండి చెరువుకు వర్షాల వల్ల వచ్చే నీటితో ఇబ్బందేమైనా ఉందా అని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మిని అడగగా ఈ గండి చెరువుకు చెక్‌డ్యాం ఉందని, వర్షపాతం ఎక్కువగా ఉంటే ఈ డ్యాం ద్వారా నీరు కాల్వలోకి వెళ్తుందని, ఇబ్బందేమి ఉండదని చెప్పారు. అలాగే మండలంలోని చెరువులు, కాల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్య ఉంటే వెంటనే పరిష్కరించే విధంగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, ఎంపీడీవో ప్రభాకరరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాణి, వీఆర్వోలు ఉన్నారు.

రేవుల్లోకి దిగొద్దు : ఎస్ఐ

పెరవలి, సెప్టెంబరు 10: గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎవరూ గోదావరి రేవుల్లో దిగరాదని ఎస్ఐ అప్పారావు హెచ్చరించారు. మంగళవారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, మల్లేశ్వరం, ఖండవల్లి, గోదావరి రేవుల్లో హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేశారు. రెవెన్యూ సిబ్బంది కూడా రేవుల వద్ద ఎవరు వెళ్లడానికి వీలు లేకుండా తాళ్లు కట్టి నిఘా పెట్టారు.

ఉగ్ర గోదావరి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటి మట్టం
- 10 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 10: భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాలు వల్ల ఇంద్రావతి నుంచి వరద నీరు, వాయుగుండం ప్రభావంతో ఒరిస్సా పరిసరాల్లో కురిసిన వర్షాలు వల్ల శబరి నది ఉధృతమై గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి నుంచి పెరుగుతున్న నీటిమట్టం గంటకు ఒక్క పాయింట్ చొప్పున పెరుగుదల నమోదు చేసుకోగా మంగళవారం ఉదయం నుంచి మరింత ఉధృతమై గంటకు రెండు పాయింట్లు చొప్పున పెరిగిన నీటి మట్టం రాత్రి 11గంటలకు 13 అడుగులకు చేరి 11,55,027 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండడంతో రిజర్ కంజర్వేటర్ మొదటి ప్రమాదహెచ్చరికను జారీ చేశారు. ఆపై పెరుగుతున్న నీటి మట్టం రాత్రి 8గంటలకు 12.01 అడుగులుగా నమోదయింది. నీటిమట్టం మరింత పెరిగి బుధవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 13.75అడుగులకు పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద పెరుగుదల వేగం మందగించడంతోపాటు శబరి ఉధృతి తగ్గడంతో ధవళేశ్వరం వద్ద 15లక్షల క్యూసెక్కుల



ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



కాటన్ బ్యారేజ్ వద్ద ఉధృతంగా దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

వరకు వరద రావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం వద్ద వేగంగా పెరుగుతున్న నీటి మట్టం మంగళవారం ఉదయం 9గంటలకు మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి దాటి ప్రవహించగా సాయంత్రం 5గంటలకు 48.20 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై పెరుగుతున్న నీటి మట్టం రాత్రి 8గంటలకు 49.10అడుగులకు చేరుకుంది.

ఎగువ నీటి మట్టాలు ఇవే.. ఎగువున కాళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం 8.60మీటర్లుగా నమోదు కాగా, పేరూరు వద్ద 17.33మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.50మీటర్లు, భద్రాచలం వద్ద 48.60అడుగులు, కూనవరం వద్ద 20.28మీటర్లు, కుంట వద్ద 15.13మీటర్లు, పోలవరం వద్ద 12.52మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 15.82 మీటర్లుగా నీటి మట్టం నమోదయింది.

వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంగళవారం సాయంత్రం కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ కాటన్ బ్యారేజ్ పైనుంచి పరిశీలించారు. నీటి మట్టం కొలిచే సూచీలు ఉన్న ప్రాంతానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో ఉన్న నీటి మట్టాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చెప్పారు. ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకైనా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో రేవుల వద్దకు ప్రజలను అనుమతించబోమని, ఉత్సవ కమిటీకి చెందిన కొందరిని మాత్రమే అనుమతిస్తామన్నారు. గోదావరి ఘాట్లలో స్నానాలకు ప్రజలు వెళ్లవద్దని సూచించారు. వీరి వెంట ధవళేశ్వరం సీఐ గణేష్, ఇరిగేషన్ ఇంజనీర్లు నాగలక్ష్మి, ఎ.సాయిరాం తదితరులున్నారు.

చిరుతపులి జాడ కనబడలేదు

- అటవీ ప్రాంతాన్ని ఆనుకుని హౌసింగ్‌బోర్డు కాలనీ వాసుల చెత్తాచెదారం
- పందుల సంచారంతో పులికి సమృద్ధిగా ఆహారం
- జిల్లా ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 10: చిరుతపులి జాడ ఏ ట్రాప్ కెమెరాలలో కనబడలేదని, దాని పాదముద్రలు కూడా గుర్తించబడలేదని జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి తెలిపారు. చిరుతపులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకు గాని, పశువులకు గాని ఎటువంటి హాని జరగలేదని మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో మీడియాకు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విధంగానే మంగళవారం కుడా చిరుతపులిని పట్టుకొనేందుకు అదనంగా బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతాల్లో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని చెప్పారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న నివాస ప్రాంతమైన హౌసింగ్‌బోర్డు కాలనీలోని గృహాల వద్ద నుంచి చెత్తను వేసి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారన్నారు. దీని వల్ల పందులు విపరీతంగా ఉండడంతో చిరుతపులికి ఆహారం సమృద్ధిగా లభిస్తోందని అన్నారు. కావున రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న నివాస ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద చెత్తను పక్కనే ఉన్న అడవిలో వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రఘునాథపురంలో ఒక దూడను చిరుతపులి చంపినట్టుగా వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన సమాచారంలో వాస్తవం లేదన్నారు. ఈ దూడ కనిన్ కుటుంబం(కుక్కలు, నక్కలు)కు చెందిన జంతువు దాడి వల్ల చనిపోయిందన్నారు. అసత్యప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని కోరారు. నకిలీ సందేశాలకు పాల్పడినవారిపై పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

సాధనతో విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

కేంద్రీయ విద్యాలయ హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోడానికి నిరంతర సాధన చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయ హైస్కూల్‌లో మంగళవారం భారత రాజ్యాంగం, నల్సావారి 'పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సంరక్షణ పథకం-2015'పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు న్యాయ సహాయం అవసరమైతే డీఎల్ఎస్ఏని సంప్రదించవచ్చన్నారు. స్కూల్లోని సదుపాయాలు, విద్యా విధానం గురించి కార్యదర్శికి ప్రిన్సిపాల్ వర్షజైన్ వివరించారు. అనంతరం తపాలా శాఖ అధికారులతో ప్రకాశ్‌బాబు సమీక్షా సమావేశం నిర్వ హించారు. నల్సా వెబ్‌పోర్టల్ గురించి విశదీకరించారు. వెబ్‌పోర్టల్ ద్వారా ప్రజలు ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా డీఎల్ఎస్ఏకి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల దరఖాస్తుకు 13 గడువు

సీతానగరం, సెప్టెంబరు 10: సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ చిక్కం దొరబాబు మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో పౌరశాస్త్రం(సివిక్స్) పోస్టు ఖాళీగా ఉందని, ఈ సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. వీరికి గంటకు రూ.150 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.10 వేల వరకు చెల్లించనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను జతపర్చి ఈ నెల 13లోపు కళాశాలలో అందజేయాలన్నారు. బోధనా పటిమ ఆధారంగా అభ్యర్థిని ఎంపిక చేస్తామని చెప్పారు.

యర్నగూడెంలో వ్యక్తి అదృశ్యం

కాల్వలో పడి గల్లంతైనట్టు అనుమానం

గజ ఈతగాళ్లతో పోలీసుల గాలింపు చర్యలు





యర్నగూడెం శివారు కాల్వలో గాలిస్తున్న ఈతగాళ్లు, శాంతారావు(ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 10: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన చిగురుపల్లి శాంతారావు దేవరపల్లి పొగాకు బోర్డులో అవుట్‌సోర్సింగ్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. అత్తవారు ఊరైన నల్లజర్ల మండలం నబీపేటలో ఉంటున్నారు. దేవరపల్లిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రతిరోజు ఉదయం వచ్చి సాయంత్రం వెళ్తుంటాడు. సోమవారం సాయంత్రం నబీపేటకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. 5.30నుంచి 7.30గంటల సమయంలో యర్నగూడెం శివారు గండి చెరువు వంతెన పైన బైక్ ఉండడంతో స్థానిక యువకులు బండిలోని ఐడెంటీ కార్డును చూసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. శాంతారావు అన్నయ్య దుర్గారావు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శాంతరావు కాల్వలో పడి ఉంటాడనే అనుమానంతో ఆచూకీ కోసం మంగళవారం ఉదయం నుంచి 10మంది గజ ఈతగాళ్లతో కాల్వలో గాలిస్తున్నామని చెప్పారు.

కంసాలిపాలెంలో పునరావాస కేంద్రం సందర్శన



పునరావాస కేంద్రం వద్ద కూటమి నాయకులు

నిడదవోలు, సెప్టెంబరు 10: నిడదవోలు మండలం కంసాలిపాలెంలో పునరావాస కేంద్రం ఏర్పాటుచేయలేదని వైసీపీ నాయకులు చేసిన విమర్శలను కూటమి నాయకులు ఖండించారు. కూటమి నాయకులు మంగళవారం కంసాలిపాలెంలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి విమర్శ చేసేటప్పుడు వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని తెలుగు యువత మండలాధ్యక్షుడు కోయి రమేష్ అన్నారు.

ఏపీ ఎంప్లాయిమెంట్ ఆన్‌లైన్ సర్వీసులు

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి హరిశ్చంద్రప్రసాద్



యువకుడిని ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 10: కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత సహకారంతో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 125 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి హరిశ్చంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎంప్లాయిమెంట్ విభాగం ఆన్‌లైను సర్వీసులు ప్రారంభించామన్నారు. నిరుద్యోగ యువతీయువకులు www.employment.ap.gov.in వెబ్‌సైట్‌లో ఎంప్లాయిమెంటు రిజిష్టర్ చేసుకోవచ్చు. కేంద్రంలో గాని, దేశ వ్యాప్తంగా ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల కోసం www.ncs.gov.in పోర్టల్‌లో జాబ్ సేకర్స్ పోర్టల్‌లో వన్‌టైమ్ పాస్‌వర్డ్‌తో సెల్‌లోనే రిజిష్టర్ చేసుకోవచ్చునన్నారు. మీ అర్హతలను బట్టి సెల్‌కు సమాచారం అందిస్తారన్నారు. జిల్లా అడిషనల్ స్కిల్ డెవలప్‌మెంటు అధికారి పెరుమాళ్ళరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లలో శిక్షణను అందించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు చెప్పారు.

వరద బాధితులకు బియ్యం సేకరణ

నల్లజర్ల, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు గ్రామాల్లో బియ్యం సేకరణ చేస్తున్నట్టు చీపురుగూడెం అధ్యక్షుడు జీ.వరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చీపురుగూడెం, తిమ్మన్నపాలెం గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి బియ్యం సేకరించామని, నియోజకవర్గం నుంచి పార్టీ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో 10 టన్నుల బియ్యం సేకరించి విజయవాడ తరలించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి హరిబాబు, చెల్లు కృష్ణమూర్తి, తలశెట్టి మధు, శివప్రసాద్,వంశీ, చెల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు

గోపాలపురం, సెప్టెంబరు 10: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోపాలపురం ఏవో వెంకాయమ్మ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రభుత్వ పాఠశాల ఆవరణలు జలమయమయ్యాయి. దీంతో వాతావరణం అనుకూలించడంతో పంచాయతీ కార్యదర్శి వెంకాయమ్మ పర్యవేక్షణలో గ్రామంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిల్వ ఉన్న నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపించారు. అలాగే పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్మికులతో బ్లీచింగ్ చల్లించారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

బసివిరెడ్డి పేట వద్ద బ్రాహ్మణగూడెం యువకుడి గల్లంతు

నిడదవోలు, సెప్టెంబరు10: వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. నిడదవోలు మండలం బసివిరెడ్డిపేట వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువలో మంగళవారం సాయంత్రం వినాయకుడి విగ్రహం నిమజ్జనం చేస్తుండగా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంకు చెందిన పేరాట రాజేష్(20) గల్లంతయ్యాడు.కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆచూకీ కానరాలేదు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయాలని యువకుడి బంధువులు ఆందోళనకు దిగారు. మంగళవారం అర్ధరాత్రి వరకూ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు.